ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5



అనకాపల్లి

జిల్లా వార్తలు

మంగళవారం 9 జనవరి 2024



చంద్రబాబు విశాఖ రాక రేపు

విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): 'రా...కదలిరా..' పేరుతో విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఈనెల పదో తేదీన నిర్వహించనున్న బహిరంగసభకు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. బుధవారం ఉదయం గన్నవరం నుంచి బయలుదేరి 11 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఆయన ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో బొబ్బిలి వెళతారని పార్టీ వర్గాలు తెలిపాయి. బొబ్బిలి సభ అనంతరం హెలికాప్టర్‌లో కాకినాడ జిల్లా తుని సమీపంలోని చామవరం వెళతారు. అక్కడ బహిరంగ సభలో పాల్గొంటారు.

సంక్రాంతికి రెఢీ

పండుగ సందర్భంగా పందాలకు కోడి పుంజులు సిద్ధం

పెంపకంపై ఆసక్తి చూపుతున్న పలువురు ఔత్సాహికులు

- పుంజులకు బలవర్థకమైన ఆహారం, కఠోర శిక్షణ
- పందాలల్లో గెలుపే లక్ష్యంగా తర్ఫీదు
- పుంజు జాతి, పోరాట పటిమనుబట్టి ధర
- కనిష్ఠంగా రూ.10 వేలు.. గరిష్ఠం రూ.లక్షకుపైనే!



శిక్షణ పోటీల్లో కోడి పుంజులు

చోడవరం, జనవరి 8: సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహించే కోడి పందాలకు బరిలో దిగడానికి కోడి పుంజులు సిద్ధం అయ్యాయి. సంక్రాంతికి వారం రోజుల ముందే గ్రామాల్లో కోడిపందాలకు సన్నాహాలు మొదలయ్యాయి. ఏటా సంక్రాంతికి, ఆ తరువాత వచ్చే గ్రామ దేవతల తీర్థాల్లో కోడిపందాలు జోరుగా సాగుతుండడం సర్వసాధారణం. ఉభయ గోదావరి జిల్లాల్లో మాదిరిగా భారీ స్థాయిలో కాకుండా, జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ రీతిలో కోడిపందాలు నిర్వహించడం అనాదిగా వస్తున్నది. ఇందుకోసం పలువురు ఔత్సాహికులు గత కొద్ది రోజుల నుంచి కోడి పుంజులను సిద్ధం చేస్తున్నారు. ముందుగా పలు జాతుల కోడి పుంజులను గుర్తించి, వాటికి బలవర్థకమైన ఆహారం ఇవ్వడంతోపాటు, పలురకాల శిక్షణ ఇస్తారు. ఈ పనులను రోజువారీ ఒక క్రమపద్ధతిలో నిర్వహిస్తారు. పందెం పుంజులకు ఇచ్చే ఆహారం, వాటి పోషణ, శిక్షణ కోసం నెలకు ఒక్కో పుంజుకు సుమారు రూ.15 వేల వరకు ఖర్చు చేస్తారంటే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. పందెంలో తమ పుంజులు గెలవడమే ముఖ్యంగా భావించే పలువురు ఔత్సాహికులు ఇటువంటి ఖర్చులను పెద్దగా లెక్కచేయడంలేదు.

రెండు రకాలుగా కోడి పందాలు

జిల్లాలోని గ్రామాల్లో కోడిపందాలను రెండు రకాలుగా- అంటే కత్తిపందాలు, డింకీ పందాలుగా నిర్వహిస్తారు. కత్తి పందెంలో పాల్గొనే కోడిపుంజుల కాళ్లకు కత్తులు కట్టి బరిలోకిఇ దించుతారు. కత్తి దెబ్బలు కాచుకుని ఏ పుంజు నిలుస్తుందో దానిని విజేతగా ప్రకటిస్తారు. ఇక డింకీ పందెంలో కోడిపుంజుల కాళ్లకు కత్తులు కట్టకుండా పోటీకి దించుతారు. గెలుపు తేలేవరకూ రెండు పుంజులూ తలపడతాయి. ఏ పుంజు పారిపోతే అది ఓడినట్టు, బరిలో నిలిచిన పుంజును విజేతగా ప్రకటిస్తారు. సంక్రాంతి పండుగ, గ్రామదేవత తీర్థాల్లో సమయం, సందర్భాన్నిబట్టి కత్తి లేదా డింకీ పందాలు నిర్వహిస్తుంటారు.



పందెం పుంజులు.. రకాలు!

పందెం పుంజులు చూడగానే వాటి ఆకృతి చూపరులను ఆకట్టుకునేలా దృఢంగా ఉంటాయి. కోడి పుంజుల శరీర దారుఢ్యం, వాటి ఆకారం, రంగు, ఎత్తు, తోక, ఈకలను బట్టి వాటికి వివిధ రకాల పేర్లున్నాయి. సవల, నల్ల సవల, తెల్ల సవల, నెమలి సవల, కోడి సవల, పక్షి సవల, డేగ, నెమలి డేగ, కోడిడేగ, గెడ్డ డేగ, చింతపిక్క, రంగుడేగ, కోడి నెమలి, నెమలి, మైల, కాకి, గట్టికాకి, సుద్దకాకి, కోడికాకి, నెమలికాకి. కుసు నలుపు కాకి, పచ్చకాకి, పూల, పింగళ, నెమలికుచ్చు సలవ, సేతువ, తెల్లసేతువు నల్లబొట్లసేతువు, పీల, డేగ పర్ల, నల్ల పాశ, పెట్టమారి, గేరువ, చిక్కని గేరువ, పండు గేరువ, ఇటుక గేరువ, అబ్రసు, రసంగి, పువల, తెల్లపువల, భోగ, కొత్తభోగ.. ఇలా పలు జాతులు, రకాలు ఉన్నాయి. పందెం పుంజులు వాటి జాతి, పోరాటతత్వం ఆధారంగా ధర పలుకుతాయి. ఒక్కో పుంజు కనిష్ఠంగా రూ. 10 వేలు, గరిష్ఠంగా లక్ష రూపాయలు వుంటుందని పందెం పుంజుల పెంపకందారులు చెబుతున్నారు.

అదిరేటి మెనూ!

పందెం కోళ్లకు శక్తిని ఇవ్వవడంతోపాటు, అనవసర కొవ్వు ఏర్పడకుండా ఆహారాన్ని ఇస్తుంటారు. పోరులో ఎదుటి పుంజు దాడిని, కత్తి దెబ్బలను కాచుకుని పోటీపడడానికి శరీరం దృఢంగా ఉండేలా జీడి పప్పు, నాటుకోడిగుడ్లు, బాదంపప్పు, పిస్తా పప్పు, ఎండుద్రాక్ష, ఎండు ఖర్జూరం, నల్లజీలకర్ర, దంపుడు బియ్యం, రాగులు, సజ్జలతో కూడిన ఆహారం ఇస్తుంటారు. ఇంకా రాగులు, సజ్జలు, దంపుడు బియ్యం, మినపప్పు, శగనపప్పు, గోధుమలు కలిపిఇ తయారు చేసిన ఆహారాన్ని పెడతారు.

కఠోర శిక్షణ

పందెం పుంజులకు క్రమపద్ధతిలో శిక్షణ తప్పనిసరి. పందెంలో కోడి పుంజు త్వరగా ఆలసిపోకుండా వుండడానికి, ఎక్కువసేపు పోరాడేలా రోజూ ఉదయాన్నే కోడిపుంజు నోట్లో నీరుకొట్టి కఫాన్ని బయటకు రప్పిస్తారు. దీనిని గస ప్రక్రియ అంటారు. తరువాత నాటు కోడిగుడ్డు తెల్లసొను కోడి పుంజుకు తినిపించి సుమారు అరగంట సేపు కోడిని పరుగులు పెట్టిస్తారు. తరువాత మరోసారి నోట్లో నీరుకొట్టి కఫాన్ని బయటకు తెప్పిస్తారు. ఈ ప్రక్రియ తరువాత కొంత సేపు విశ్రాంతి ఇచ్చి బలవర్థకమైన ఆహారం పెడతారు. జీడిపప్పు, బాదంపప్పు, ఎండు ద్రాక్ష, ఎండు ఖర్జూరం, నల్లజీలకర్ర, తెల్లజీలకర్ర, గసగసాలు కలిపి బాగా దంచి, ముద్దగా చేసి కోడిపుంజులకు తినిపిస్తారు. ఈ ఆహారం ఇచ్చిన రెండు గంటల తరువాత కోడిని ... మిగతా 8వ పేజీలో





పుంజులకు బాదంపిక్కలు తినిపిస్తున్న శిక్షకుడు





పెందుర్తి నుంచి అమర్‌కు చాన్స్?

పార్టీ వర్గాల్లో విస్తృతంగా ప్రచారం

మూడో జాబితాలో పేరు ఉంటుందంటున్న ఆయన అనుయాయులు



మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- వాస్తవానికి ఎలమంచిలి లేదా చోడవరం నుంచి పోటీకి ఆసక్తి చూపిన మంత్రి
- సిట్టింగ్ ఎమ్మెల్యేలు ససేమిరా అనడంతో పెందుర్తి వైపు చూపు
- సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శిబిరంలో కలకలం



పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికలకు మరో మూడు నెలలు మాత్రమే సమయం ఉండడంతో అభ్యర్థుల ఎంపికపై వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం దృష్టిసారించింది. ఇప్పటికే రెండు విడతలుగా 38 మందిని ప్రకటించింది. తాజాగా మరో 22 మందితో మూడో విడత జాబితా విడుదల చేయబోతున్నట్టు పార్టీలో పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. అందులో పెందుర్తి నుంచి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేరును ఖరారు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఇది సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ వర్గీయుల్లో కలవరం రేపుతోంది.

వైసీపీ నెల రోజుల కిందట తొలివిడత 11 మందితో ఒక జాబితా విడుదల చేసింది. గాజువాక నియోజకవర్గానికి సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని, ఆయన కుమారుడు దేవన్‌రెడ్డిని కాకుండా 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావును సమన్వయకర్తగా నియమించింది. కొద్దిరోజుల కిందట 27 మంది అభ్యర్థులతో రెండో జాబితా విడుదల చేసింది. అందులో ఉమ్మడి జిల్లాకు సంబంధించి పాయకరావుపేట టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు కాకుండా విజయనగరం జిల్లా రాజాం సిట్టింగ్ ఎమ్మెల్యే కంబాల జోగులుకు కేటాయించింది. తాజాగా మరో 22 మంది అభ్యర్థులతో మూడో జాబితాను సిద్ధం చేసినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. మూడో జాబితాలో పెందుర్తి అభ్యర్థిగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేరు ప్రకటించడం ఖాయమని అంటున్నారు. ఈ మేరకు రెండు రోజుల కిందటే అధిష్ఠానం నుంచి సంకేతాలు అందాయంటూ పేర్కొంటున్నారు. అయితే ... మిగతా 8వ పేజీలో

క్షీణిస్తున్న పారిశుధ్యం.. పొంచి ఉన్న అంటువ్యాధుల ముప్పు



ఎలమంచిలి బస్టాండ్ వీధిలో డంపర్ బిన్ నిండిపోయి పక్కన పేరుకుపోయిన చెత్త

అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలిలో మునిసిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల సమ్మె కొనసాగుతున్నది. అనకాపల్లి, నర్సీపట్నంలో 14వ రోజుకు, ఎలమంచిలిలో 7వ రోజుకు చేరింది. కార్మికులు దీక్షా శిబిరాల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఎలమంచిలిలో చెవిలో పువ్వులు పెట్టుకుని, నర్సీపట్నంలో నడుముకు వేప కొమ్మలు కట్టుకొని ర్యాలీ నిర్వహించారు. కాగా పారిశుధ్య కార్మికుల సమ్మె కారణంగా ఆయా పట్టణాల్లోని వీధుల్లో చెత్త కుప్పలు కొండలా పేరుకుపోతున్నాయి. చెత్తాచెదారం కుళ్లిపోయి తీవ్రదుర్వాసన వస్తున్నది. డ్రైనేజీల్లో మురుగునీరు నిల్వ వుండడంతో దోమల బెడద పెరిగింది. పారిశుధ్యం క్షీణిస్తుండడంతో అంటురోగాలు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అంగన్‌వాడీల పోరు ఉధృతం... వినూత్న రీతుల్లో నిరసనలు



కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్న అంగన్ వాడీలు

రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారానికి 28వ రోజుకు చేరింది. అదే విధంగా కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరాయి. ప్రభుత్వం బెట్టు వీడి, మెట్టు దిగి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, లేకుంటే రానున్న ఎన్నికల్లో వైసీపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అంగన్‌వాడీలు హెచ్చరించారు. ఇదిలావుండగా అంగన్‌వాడీల సమ్మెను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడంపై అంగన్‌వాడీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరసన శిబిరాల వద్ద ఎస్మా జీవో కాపీలను దహనం చేశారు. ప్రభుత్వ బెదిరింపులకు లొంగేదిలేదని స్పష్టం చేశారు. దీక్షా శిబిరాల్లో మోకాళ్లపై నిల్చుని, చెవుల్లో పువ్వులు పెట్టుకుని వినూత్న రీతుల్లో నిరసన తెలిపారు. పాయకరావుపేటలో నల్ల బెలూన్లు పట్టుకుని ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. -అనకాపల్లి

ఊపందుకున్న బెల్లం లావాదేవీలు

- ఎన్టీఆర్ మార్కెట్ యార్డుకు 14,939 బెల్లం దిమ్మలు రాక
- గత వారంతో పోలిస్తే తగ్గిన ధరలు.. రైతులు నిరాశ



మార్కెట్ యార్డులో ప్లాట్‌ఫారంపై బెల్లం దిమ్మలు

అనకాపల్లి టౌన్, జనవరి 8: స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో బెల్లం లావాదేవీలు ఊపందుకున్నాయి. సంక్రాంతి పండుగ సమీపిస్తుండడంతో రైతులు బెల్లం తయారీని ఉధృతం చేశారు. వాస్తవంగా ప్రస్తుత బెల్లం సీజన్ గత ఏడాది కార్తీక మాసంలోనే ప్రారంభం అయినప్పటికీ ఇటీవల వరకు మార్కెట్ యార్డుకు అంతంతమాత్రంగానే బెల్లం దిమ్మలు వచ్చాయి. నైరుతి సీజన్‌లో కరువు ప్రభావంతో వర్షాధార భూముల్లో చెరకు తోటలు ఎండిపోగా, మిగిలిన తోటల్లో గత నెలలో తుఫాన్ కారణంగా రెండు వారాలకుపైగా నీరు నిలవడం, భూమి ఆరకపోవడంతో బెల్లం తయారీ పనులను ఆలస్యంగా మొదలు పెట్టాల్సి వచ్చింది. గత నెల చివరి వారం నుంచి బెల్లం తయారీ ఊపందుకుంది. సోమవారం మార్కెట్ యార్డుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల రైతులు 14,939 బెల్లం దిమ్మలను తీసుకువచ్చి విక్రయించారు. ప్రస్తుత సీజన్‌లో ఒక రోజు అమ్మకాల్లో ఇంతవరకు ఇవే అత్యధికం. ఇదిలావుండగా ఆ రోజుతో పోలిస్తే సోమవారం బెల్లం ధరలు బాగా తగ్గాయి. గత మంగళవారం ఒకటో రకం బెల్లం వంద కిలోలు రూ.4,500, రెండో రకం రూ.4,250లు, మూడో రకం రూ.3,730 పలికాయి. సోమవారం ఒకటో రకం రూ.4,230, రెండో రకం రూ.3,850, మూడో రకం రూ.3,400కు పడిపోయాయి. బెల్లానికి గిరాకీ ఉన్న సమయంలో ధరలు తగ్గిపోవడంతో దీంతో రైతులు నిరాశ చెందారు. అయితే బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి ఆర్డర్లు తక్కువగా వుండడం, మార్కెట్ యార్డుకు సరకు ఎక్కువగా రావడం వల్ల ధరలు తగ్గాయని వర్తకులు చెబుతున్నారు.

విశాఖ రేంజ్‌లో 28 మంది సీఐల బదిలీ -7లో

అసకపల్లిలో గెడ్డ వాగు కబ్జా

- రియల్టర్ల భూముల్లోకి దారి కోసం ఆక్రమణ
- తాటి, చింతచెట్లు నరికివేత
- 30 అడుగుల వెడల్పుతో మట్టిరోడ్డు నిర్మాణం
- 'స్థానిక' నేతలు సహకారం
- పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు



అసకపల్లి సర్వే నంబరు 139/13 గెడ్డ వాగులో నరికివేసిన తాటి, చింత చెట్లు

సబ్బవరం, జనవరి 8: మండలంలోని అసకపల్లిలో గెడ్డ వాగు భూమి ఆక్రమణకు గురైంది. కబ్జాదారులు వాగులో ఉన్న తాటి, చింత చెట్లను యంత్రాల సాయంతో కూకటివేళ్లతో సహా కూల్చివేసి, ముక్కలుగా నరికివేశారు. పక్కనే వున్న రియల్ ఎస్టేట్ లేఅవుట్‌లోకి రాకపోకల కోసం సుమారు 30 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మించారు. సుమారు నెల రోజుల నుంచి ఈ దందా సాగుతున్నప్పటికీ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఇటువైపు కన్నెత్తి అయినా చూడలేదు. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

అసకపల్లిలో 139/13 సర్వే నంబరులో 52 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. దీని మధ్య నుంచి వర్షపు నీరు ప్రవహించే గెడ్డ ఉంది. ఈ గెడ్డ నుంచి దిగువున ఉన్న సాగునీటి చెరువులోకి వర్షం నీరు చేరుతుంది. ఈ చెరువు కింద సుమారు 20 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇదిలావుండగా గెడ్డకు ఎగువున ఉన్న జిరాయితీ భూములను కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇళ్ల స్థలాల లేఅవుట్ వేయాలంటే కనీసం 30 అడుగులు రహదారి అవసరం. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను గెడ్డవాగుపై పడింది. స్థానిక నేతలను కలిసి 'బేరం' కుదుర్చుకున్నారు. గెడ్డలో నుంచి రోడ్డు వేయించే బాధ్యత తమదే అంటూ రియల్టర్లకు భరోసా ఇచ్చారు. ఎంత ఖర్చు అవుతుందో నేతలు చెప్పారు. రియల్టర్లు అందుకు ఓకే చెప్పారు. గెడ్డవాగులో ఉన్న తాటి, చింత చెట్లను కూల్చివేయించారు. గెడ్డను పూడ్చేసి వర్షం నీరు పోవడానికి చిన్నపాటి కాలువ ఏర్పాటు చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూముల్లోకి రాకపోకల కోసం సుమారు 30 అడుగుల వెడల్పుతో మట్టి ... మిగతా 8వ పేజీలో



గెడ్డవాగు స్థలంలో నిర్మించిన రేకుల షెడ్లు

ఓటర్ల తుది జాబితాలపై కసరత్తు!

- అభ్యంతరాలు, మార్పులు, చేర్పుల కోసం 12వ తేదీ వరకు గడువు
- చనిపోయిన ఓటర్ల పేర్లు తొలగింపుపై ప్రత్యేక జాగ్రత్తలు
- ఆయా వ్యక్తుల ఇళ్లకు వెళ్లి నిర్ధారించుకుంటున్న సిబ్బంది
- 22న తుది ఓటరు జాబితాలు విడుదలకు ఏర్పాట్లు



అనకాపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం కొత్త ఓటర్ల తుది జాబితాలల రూపకల్పనకు కసరత్తు చేస్తోంది. గత ఏడాది డిసెంబరు 9వ తేదీ వరకు అందిన దరఖాస్తులను పరిష్కరించిన ఎన్నికల అధికారులు.. ఆ తరువాత అందిన దరఖాస్తులను ఈ నెల 12వ తేదీలోగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. జిల్లా ఎక్టోరల్ అధికారి రవి పట్టన్‌శెట్టి నేతృత్వంలో తుది ఓటరు జాబితాల రూపకల్పనకు కృషి జరుగుతోంది.

వాస్తవానికి ఎన్నికల సంఘం తొలుత విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఈ ఏడాది జనవరి 5న తుది ఓటర్ల జాబితా విడుదల చేయాలి. కానీ ముసాయిదా జాబితాలకు సంబంధించి అభ్యంతరాలు, మార్పులు, చేర్పులకు అర్జీలు భారీగా అందుతుండడంతో వాయిదా వేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 22వ తేదీన ఓటర్ల తుది జాబితాను విడుదల చేయనున్నట్టు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలో 12,57,707 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 6,13,144 మంది పురుషులు, 6,44,516 మంది మహిళలు, 47 మంది ఇతరులు ఉన్నారు. సవరణల కోసం అందిన దరఖాస్తుల పరిశీలన తుది దశకు చేరిందని ఇటీవల కలెక్టర్ వెల్లడించారు. ప్రధానంగా మృతిచెందిన ఓటర్లను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించి, సదరు ఓటర్లు చనిపోయినట్టు నిర్ధారించుకున్న ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి



గొర్లె ప్రసాద్ (ఫైల్)

అచ్యుతాపురం, జనవరి 8: అచ్యుతాపురం-గాజువాక రోడ్డులో బజాజ్ షోరూమ్ ఎదురుగా సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. పరవాడ మండలం గొర్లెవానిపాలెంకి చెందిన గొర్లె ప్రసాద్ (35) పదేళ్లుగా ఫోటో గ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం ఫోటోగ్రఫీ పనిపై అచ్యుతాపురం వచ్చి తిరిగి స్వగ్రామం స్కూటీపై వెళ్తుండగా అచ్యుతాపురం ప్రధాన కూడలి దాటిన వెంటనే బజాజ్ షోరూమ్ ఎదురుగా వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ ముందుభాగం స్కూటీకి తగిలింది. దీంతో స్కూటీ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయింది. అదే సమయంతో లారీ ముందు చక్రం ప్రసాద్ తల పైనుంచి వెళ్లిపోవడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రసాద్‌కి ఇంకా వివాహం కాలేదు. తల్లిదండ్రులతో పాటు ఒక చెల్లి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు.

కంటైనర్ బోల్తా



బోల్తాపడిన కంటైనర్



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

- ధ్వంసమైన ఆటో
- స్వల్పగాయాలతో బయటపడిన లారీ డ్రైవర్

పరవాడ, జనవరి 8 : స్థానిక మండల పరిషత్ జంక్షన్‌లో సోమవారం మధ్యాహ్నం భారీ కంటైనర్ బోల్తా పడింది. రహదారి పక్కనే ఆగి ఉన్న ఆటో ధ్వంసమైంది. ఆటోలో ఉన్న డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అచ్యుతాపురం సెజ్ నుంచి బ్రిక్స్ లోడ్‌తో కంటైనర్ విశాఖ పోర్టుకు బయలుదేరింది. లారీ మండలపరిషత్ కూడలి వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో ప్రయాణికుల కోసం ఆటో రహదారి పక్కనే నిలిచి ఉంది. ఆటోలో ఉన్న డ్రైవర్ శ్రీరామ్మూర్తి ప్రమాదాన్ని పసిగట్టి తప్పించుకున్నాడు. కంటైనర్ .. ఆటోపై పడడంతో ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ రాము తలకు గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



సింహాచలంనాయుడు(ఫైల్)

సబ్బవరం, జనవరి 8: సబ్బవరం కొత్తరోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సబ్బవరం శివారు పెదనాయుడుపాలెంకు చెందిన రొంగలి సింహాచలంనాయుడు (59) కాకినాడ ఓఎన్‌జీసీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఇటీవల స్వగ్రామం వచ్చాడు. ఆదివారం మధ్యాహ్నం సబ్బవరం సంతకు నడుచుకుంటూ వెళుతు న్నాడు. కొత్తరోడ్డు వద్దకు వచ్చినపుటికే పెందుర్తి నుంచి సబ్బవరం వైపు వస్తున్న స్కూటీ వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో సింహాచలంనాయుడు రోడ్డుపై పడిపోయాడు, దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికంగా ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం సోమవారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు కుమారుడు రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కొత్తూరులో చోరీ

- రూ.లక్ష నగదు, పది తులాల వెండి అపహరణ



నేర స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మోహనరావు

అనకాపల్లి టౌన్, జనవరి 8: పట్టణానికి సమీపంలోని కొత్తూరులో ఒక ఇంట్లో దొంగలు పడి రూ. లక్ష నగదు, పది తులాల వెండి వస్తువులు అపహరించినట్టు పట్టణ ఎస్ఐ సింహాచలం తెలిపారు. కొత్తూరు గ్రామంలోని నగిరెడ్డి లక్ష్మి అనే మహిళ తన కుమార్తెను చూసేందుకు శనివారం మామిడిపాలెం వెళ్లింది. సోమవారం కింద పోర్షన్‌లోని ఒక వ్యక్తి మేడపైన బట్టలు అరబెట్టేందుకు వెళ్తుండగా లక్ష్మి ఇంటి తలుపు తాళాలు పగులగొట్టి ఉండడంతో ఆమెకు సమాచారం అందజేశారు. ఆమె ఇంటికి వచ్చి చూడగా బీరువాను పగులగొట్టి లోపల ఉన్న లక్ష రూపాయల నగదు, పది తులాల వెండి వస్తువులు అగంతకులు అపహరించుకుపోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలిసిన వెంటనే పట్టణ సీఐ దాడి మోహనరావు, సీసీఎస్ సీఐ నీలయ్య, ఎస్ఐలు రమేష్, సింహాచలం నేర స్థలాన్ని పరిశీలించారు. అలాగే క్లూస్ విభాగం కూడా నేరస్థలాన్ని పరిశీలించి, అగంతకుల వేలిముద్రలను సేకరించారు. పట్టణ ఎస్ఐ సింహాచలం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ దగ్ధం



మంటల్లో ఉన్న టిప్పర్ లారీ

అనకాపల్లి టౌన్, జనవరి 8 : జాతీయ రహదారిలోని డైట్ కళాశాల సమీపంలో ఆదివారం అర్ధరాత్రి టిప్పర్ అగ్నికి ఆహుతైంది. అచ్చెయ్యపేటకు చెందిన టిప్పర్ డ్రైవర్ ఉరిగిటి శ్రీనివాసరావు రాత్రి సమయంలో గ్రావెల్ లోడుతో డైట్ కళాశాల సమీపంలో గ్రావెల్‌లోడ్ అన్‌లోడ్ చేశాడు. వెనక్కి వెళుతున్న సమయంలో టిప్పర్ లిఫ్ట్ ఓపెన్ అయిపోవడంతో విద్యుత్‌వైర్లకు తగిలి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారి నరసింగరావు ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఆస్తినష్టం రూ.ఎనిమిది లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. డ్రైవర్ శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

100 లీటర్ల సారా, 15 మద్యం బాటిళ్లు స్వాధీనం

పాయకరావుపేట, జనవరి 8 : పట్టణంలో రెండు చోట్ల దాడులు నిర్వహించి 100 లీటర్ల సారా, 800 లీటర్ల బెల్లల పులుసు, 15 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. తమకు అందిన సమాచారం మేరకు దుర్గానగర్ కాలనీని ఆనుకుని దారకొండ వద్ద సారా బట్టిని గుర్తించామన్నారు. అక్కడ ఎనిమిది ప్లాస్టిక్ సంచుల్లో ఉన్న సుమారు వంద లీటర్ల సారాతోపాటు 800 లీటర్ల బెల్లం పులుసును స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. అలాగే పట్టణంలోని జీవీఆర్ ఆర్చి వద్ద పుణ్యమంతుల రాంబాబు వద్ద 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	65.00
లైవ్ ధర	85.00
విత్ స్కిన్	140.00
స్కిన్ లెస్	150.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 8: స్పందనలో వచ్చిన అర్జీల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో కలెక్టర్, జేసీ, డీఆర్వో తదితరులు 485 మంది వద్ద వినతులు స్వీకరించారు. అర్జీదారుల గోడును స్వయంగా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆలకించారు. సమస్యల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు అర్జీలను బదలాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మాట్లాడుతూ స్పందన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. స్పందనలో భూసమస్యలు, రేషన్‌కార్డులపై అధికంగా అర్జీలు వస్తున్నాయని, సంబంధిత అధికారులు వాటి పరిష్కారంలో దృష్టి సారించాలన్నారు. ఇదిలా ఉండగా కలెక్టరేట్ ఎదుట తమకు పింఛన్లు పెంచాలంటూ దివ్యాంగులు ఆందోళన నిర్వహించారు. వీరి వద్దకు డీఆర్వో దయానిధి వచ్చి వినతిపత్రం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోలీస్ అధికారులు పనిచేయాలి

- ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లిరూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోలీస్ అధికారులు పనిచేయాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. శంకరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన పాల్గొని అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అర్జీల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ అర్జీలను ఎప్పటికప్పుడూ పరిష్కరించి ఫిర్యాదుల పై తీసుకున్న చర్యలు గురించి నిర్ణీత సమయంలో నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. స్పందన ముగిసే సరికి 57 అర్జీలు అందగా అందులో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్, ఎస్ఐ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రేంజ్‌లో 28 మంది సీఐల బదిలీ

- విశాఖకు పది మంది రాక
- ఇక్కడ నుంచి ఎనిమిది మంది శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు...
- ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఒకేచోట మూడేళ్లకు మించి పనిచేస్తున్న వారికి స్థానచలనం
- సొంత జిల్లాల్లో ఉండకూడదన్న ఆదేశాలను కూడా పరిగణనలోకి తీసుకున్న ఐజీ

విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్‌లో 28 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ హరికృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. నాలుగు రోజుల క్రితం 20 మందిని బదిలీ చేసిన ఆయన...ఈ పర్యాయం మరో 28 మందికి స్థాన చలనం కల్పించారు. నాలుగు నెలల్లో ఎన్నికలు జరగనున్నందున ఒకేచోట మూడేళ్లకు మించి పనిచేస్తున్న సీఐలను మార్చారు. ఇంకా సొంత జిల్లాల్లో ఉండకూడదన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. తాజా బదిలీల్లో విశాఖ రేంజ్‌లో వేకెన్సీ రిజర్వు ఉన్న, ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న పది మందిని విశాఖ నగరానికి, నగరం నుంచి ఎనిమిది మందిని ఇతర ప్రాంతాలకు పంపుతూ ఆదేశాలు ఇచ్చారు. వేకెన్సీ రిజర్వులో ఉన్న సీఐలు జి.దుర్గాప్రసాద్, ఎస్.విద్యాసాగర్, సీహెచ్ ప్రసాద్, టి.సీతారామ్, సీహెచ్ శ్రీనివాసరావు, పి.శోభన్‌బాబును విశాఖ నగరానికి కేటాయించారు. అలాగే పి.రంగనాథాన్ని విజయనగరం ట్రాఫిక్‌కు, పీవీ జగన్నాథ రాజును విజయనగరం జిల్లా వీఆర్‌కు బదిలీ చేశారు. విజయనగరం రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం సీఐ ఆర్ఈసీహెచ్ ప్రసాద్, శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ పి.శ్రీనివాసరావు, శ్రీకాకుళం జిల్లాలో వేకెన్సీ రిజర్వులో ఉన్న ఎస్.రామకృష్ణను విశాఖ నగరానికి కేటాయించారు. ఇక విశాఖ నగరంలో పనిచేస్తున్న బి.రమణమూర్తిని శ్రీకాకుళం జిల్లా వేకెన్సీ రిజర్వుకు, కె.రామారావును విజయనగరం రెండో పట్టణ సీఐగా, జి. సోమశేఖరాన్ని శ్రీకాకుళం డీసీఆర్‌బీకి, జి.ఉమా మహేశ్వరావును శ్రీకాకుళం టూటౌన్ సీఐగా, జి.నిర్మలను శ్రీకాకుళం డీటీసీకి, కె.అశోక్‌కుమార్‌ను విజయనగరం ట్రాఫిక్ సెల్‌కు, టీవీ విజయకుమార్‌ను విజయనగరం జిల్లా సోషల్ మీడియా సెల్‌కు, ఎం. అప్పారావును పార్వతీపురం మన్యం జిల్లా సీసీఎస్‌కు, బీఎండీ ప్రసాద్‌ను పార్వతీపురం మన్యం సోషల్ మీడియా సెల్‌కు బదిలీ చేశారు. శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ సీఐ టి.ఇమ్మాన్యుయల్ రాజును ఇచ్ఛాపురం సీఐగా నియమించి, ఆయన స్థానంలో అక్కడి డీసీఆర్‌బీ సీఐ సీహెచ్ సూరినాయుడుకు పోస్టింగ్ ఇచ్చారు. అనకాపల్లి జిల్లా పరవాడ సీఐ పి.ఈశ్వరరావును శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ సీఐగా నియమించి, అక్కడ పని చేస్తున్న జి.శంకరరావును అనకాపల్లి టౌన్ సీఐగా, అనకాపల్లి ట్రాఫిక్ సీఐ టి.శ్రీనివాసరావును శ్రీకాకుళం జిల్లా సోషల్ మీడియా సెల్‌కు, విజయనగరం రెండో పట్టణ సీఐ ఎన్‌హెచ్‌వీ ఆనంద్‌ను కాశీబుగ్గ పట్టణ యూపీఎస్‌కు, అక్కడ పని చేస్తున్న డి.నవీన్‌కుమార్‌ను పాడేరు యూపీఎస్ సీఐగా పోస్టింగ్ ఇస్తూ ఐజీ ఉత్తర్వులు జారీచేశారు.

ఉపాధ్యాయుల ముందస్తు అరెస్టు

- నేడు, రేపు విజయవాడలో నిర్వహించే ఆందోళన కార్యక్రమంలో పాల్గొనకుండా అడ్డుకుంటున్న ప్రభుత్వం
- జిల్లాలో 24 మందికి 151 నోటీసులు



అనకాపల్లి మండలం మామిడిపాలెం జడ్పీ ఉన్నతపాఠశాలలో యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శికి నోటీసు అందించి, అదుపులోకి తీసుకున్న కానిస్టేబుల్

అనకాపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో మంగళ, బుధవారాల్లో నిర్వహించ తలపెట్టిన ధర్నాకు జిల్లా నుంచి ఉపాధ్యాయులు వెళ్లకుండా ప్రభుత్వం కట్టడి చేస్తోంది. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, ప్రభుత్వం నుంచి ఎదురవుతున్న ఆర్థికపరమైన ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఉపాధ్యాయుల సమాఖ్య ఈ ధర్నాకు పిలుపు ఇచ్చింది. అయితే ఆ కార్యక్రమానికి ఉపాధ్యాయులు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి సోమవారం అనకాపల్లి మండలం మామిడిపాలెం జడ్పీ పాఠశాలలో విధుల్లో ఉండగా చోడవరం పోలీసులు 151 నోటీస్ చేతిలో పెట్టారు. అనంతరం అరెస్టు చేసి చోడవరం పోలీసు స్టేషన్‌కు తరలించారు. జిల్లాలో వేర్వేరు మండలాల్లో 24 మంది ఉపాధ్యాయులకు 151 నోటీసులు అందజేశారు. పలువురు ఉపాధ్యాయులను గృహ నిర్బంధం చేశారు. ఉపాధ్యాయులు తమ సమస్యలపై ధర్నా చేసేందుకు విజయవాడ వెళుతుంటే పోలీసులతో అడ్డుకోవడాన్ని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి ఒక ప్రకటనలో ఖండించారు.



గొలుగొండలో మహిళా ఉపాధ్యాయినికి నోటీసు అందజేస్తున్న కానిస్టేబుల్

జోన్‌లో 113 అద్దె బస్సులకు ప్రతిపాదనలు

- సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సుల్లో ప్రయాణం
- పీటీడీ ఈడీ రవికుమార్



ఈడీ రవికుమార్

అనకాపల్లి టౌన్, జనవరి 8 : పీటీడీ జోన్ పరిధిలో 113 కొత్త అద్దె బస్సులకు ప్రతిపాదనలు పంపినట్టు పీటీడీ ఈడీ సీహెచ్. రవికుమార్ చెప్పారు. సోమవారం ఆయన అనకాపల్లి డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఒక్క అనకాపల్లి జిల్లాకే 27 బస్సుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. ఇప్పటికే సంక్రాంతి పండగను దృష్టిలో పెట్టుకుని హైద్రాబాద్, తిరుపతి, కడప, విజయవాడ తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. ప్రత్యేక బస్సుల్లో ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేయడం లేదని, సాధారణ చార్జీలతోనే బస్సుల్లో ప్రయాణించవచ్చునని స్పష్టం చేశారు. పీటీడీ కార్గో ఆదాయం కూడా బాగుందని తెలిపారు. జోన్‌లో గతేడాది (2022-23)లో రూ.15కోట్ల90 లక్షలు ఆదాయం రాగా, ఈ ఏడాది డిసెంబరు వరకు రూ.18.55 కోట్లు ఆదాయం లభించిందన్నారు. మార్చి నాటికి రూ.మరో 10 కోట్లు ఆదాయం వచ్చే అవకాశముందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనకాపల్లి డిపోలో గతేడాది రూ.29.69 కోట్లు ఆదాయం రాగా.. ఈ ఏడాది డిసెంబరు నాటికి రూ.33.43 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. నర్సీపట్నం డిపోకి గతేడాది రూ.33.36 కోట్లు, ఈ ఏడాది రూ.35.97 కోట్లు ఆదాయం లభించిందన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది శుభకార్యాలు ఎక్కువగా ఉండ డంతో ఆదాయం పెరిగిందన్నారు. తమకు అందిన వినతుల మేరకు అనకాపల్లి నుంచి కాకినాడకు సర్వీసు నడిపేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు. పీటీడీ నూతనంగా 1500 బస్సులు కొనుగోలు చేసిందని, వాటిలో జోన్‌కు 200 వరకు వస్తాయని భావిస్తున్నట్టు ఈడీ రవికుమార్ చెప్పారు. విలేకరుల సమావేశంలో డీపీటీవో కె. పద్మావతి పాల్గొన్నారు.

అభిజిత్ కర్మాగారంలో చర్చలు సఫలం

- కాంట్రాక్ట్ కార్మికులకు పూర్తిస్థాయిలో పనులు చేయడానికి అంగీకారం

అచ్యుతాపురం, జనవరి 8: అభిజిత్ కర్మాగారంలో కాంట్రాక్ట్ కార్మికులకు పూర్తిస్థాయిలో పనులు కల్పించడానికి యాజమాన్యం అంగీకరించడంతో సోమవారం మధ్యాహ్నం నుంచి కార్మికులు విధులకు హాజరయ్యారు. కర్మాగారం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందన్న నెపంతో కాంట్రాక్ట్ కార్మికులకు 15 రోజులే పనులు కల్పిస్తామని యాజమాన్యం ప్రకటించింది. పూర్తి స్థాయిలో పనులు కల్పించాలంటూ కార్మికులు వారం రోజుల నుంచి ఆందోళన చేస్తున్నారు. వీరికి వైసీపీ తప్ప మిగిలి టీడీపీ, జనసేన, సీఐటీయూలు మద్దతు తెలిపాయి. దీంతో దిగివచ్చిన కర్మాగారం యాజమాన్యం సోమవారం చర్చలు జరిపి గతంలో వలే నిరంతరాయంగా పనులు కల్పిస్తామని హామీ ఇచ్చింది. దీంతో కార్మికులు సోమవారం సాయంత్రం నుంచి విధులకు హాజరయారు. ఈచర్చల్లో టీడీపీ నుంచి ప్రగడ నాగేశ్వరరావు, జనసేన నుంచి సుందరపు విజయకుమార్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, అచ్యుతాపురం, జనసేన మండల అధ్యక్షుడు బైలపూడి శ్రీరామదాసు, నాయుడు, రెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర హాకీ టోర్నీకి జిల్లా జట్టు పయనం



రాష్ట్ర హాకీ టోర్నీకి పయనమైన జిల్లా హాకీ జట్టు క్రీడాకారులు

ఎలమంచిలి, జనవరి 8 : తిరుపతిలో ఈనెల 9వ తేదీ నుంచి రెండు రోజులు పాటు జరిగే ఏపీ 14వ రాష్ట్ర హాకీ టోర్నమెంటుకు అనకాపల్లి జిల్లా జట్టు సోమవారం బయలుదేరి వెళ్లినట్టు హాకీ అసోసియేషన్ ప్రతినిధి ఏబీఎల్ రాజు తెలిపారు. జిల్లా జట్టులో ఆర్ఎంఎస్.దత్తాత్రేయ, స్వరూప్ కుమార్, ఎ.వెంకటేష్, టి.నాగ గణేష్, బంగారు గణేష్, కొటారు తేజ, సీహెచ్.చరణ్, ఎం.వెంకటేష్, జె.భాను ప్రసాద్, పి. జగదీష్, కె.మహేష్, బి.రామ్‌చరణ్, స్వామి, జి.రాజ్‌కుమార్, కె.మనోజ్, ఎస్.ప్రణీత్, పి. భరత్, కె.సూర్య గణేష్ ఉన్నారన్నారు. జట్టు మేనేజరుగా మళ్ల రూపేష్ వ్యవహరిస్తారన్నారు. క్రీడాకారులను సీనియర్ క్రీడాకారులు జి.రాంబాబు, నరసింగరావు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



కారు పక్కన మహిళ మృతదేహం

- మరొకరికి తీవ్ర గాయాలు

ఎలమంచిలి, జనవరి 8 : మండలంలోని పోతిరెడ్డి జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి పది గంటల సమయంలో కారు ప్రమాదంలో మహిళ మృతి చెందగా, మరొకరి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ద్విచక్రవాహనదారుడికి గాయాలైనట్టు తెలిసింది. స్థానికుల కథనం మేరకు తుని నుంచి ఎలమంచిలి వైపు వెళుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మరో వ్యక్తికి గాయాలు కావడంతో అనకాపల్లి ఆస్పత్రికి తరలించినట్టు స్థానికులు తెలిపారు. దీంతో హైవేపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ప్రమాదం గురించి వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

'వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం అగమ్యగోచరం'

అనకాపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం అగమ్యగోచరంగా తయారైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. రైతు ద్రోహి జగన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో సాగనంపేందుకు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో రైతు సంఘ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వ్యవసాయ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్రంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టును కూడా పూర్తిచేయలేదని, అనకాపల్లి జిల్లా వరకు రైతులకు తీరని నష్టం కలిగించారన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా గ్రోయిన్ల మరమ్మతులు చేపట్టలేదన్నారు. సుజల స్రవంతి ప్రాజెక్ట్ శిలఫలకానికే పరిమితమైందన్నారు. విలేకర్ల సమావేశంలో అక్కిరెడ్డి రమణబాబు, రొంగలి సూరిబాబు, కడిమిశెట్టి నరసింగరావు, సిదిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో చోడవరానికి పతకాల పంట

- రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన ముగ్గురు క్రీడాకారులు
- మూడు విభాగాల్లో సత్తాచాటిన పరుగుల బామ్మ లక్ష్మి
- రాణించిన వెంకట రమణమూర్తి, చినబాబు



పతకాలు సాధించిన లక్ష్మి, వెంకట రమణమూర్తి, చినబాబు

చోడవరం, జనవరి 8 : పరుగుల బామ్మగా పేరొందిన చోడవరానికి చెందిన ముత్యం లక్ష్మి రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాల పంట పండించారు. ఆమెతో పాటు, పట్టణానికి చెందిన వెటరన్ క్రీడాకారులు పోటు వెంకటరమణమూర్తి, వి.చినబాబులు సైతం తమ సత్తాచాటారు. విశాఖపట్నంలోని రైల్వే గ్రౌండ్స్‌లో ఈనెల 6, 7 తేదీలలో నిర్వహించిన ఈ పోటీల్లో ముత్యం లక్ష్మి, 85 ఏళ్ల కేటగిరీలో షాట్‌పుట్, జావెలిన్‌త్రో, డిస్క్‌త్రోలో ప్రథమ స్థానాల్లో నిలిచి మూడు బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. అలాగే, స్థానిక వాకర్ క్లబ్ సభ్యులు రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ పోటు వెంకట రమణమూర్తి 65 ఏళ్ల కేటగిరీలో నాలుగు వందలు, ఎనిమిది వందలు, పదిహేను వందల మీటర్ల పరుగు పందెం పోటీల్లో మూడు బంగారు పతకాలు దక్కించుకున్నారు. అదేవిధంగా రిటైర్డ్ హెచ్‌ఎం వి.చినబాబు రెండు వందల మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించి రజత పతకం సాధించారు. వెటరన్ క్రీడల్లో ఈ ముగ్గురూ సత్తాచాటడంతో ఈ ప్రాంత క్రీడాకారులు, క్రీడాభిమానులు, వాకర్స్‌క్లబ్ సభ్యులు అభినందనలతో ముంచెత్తుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని వరహానదిలో గాలింపు

- సూసైడ్ లెటర్ ఉండడంతో అప్రమత్తమైన పోలీసులు
- సాయంత్రం వరకు గాలించినా లభ్యంకాని ఆచూకీ
- సీసీ పుటేజీలో తుని వైపు నడిచి వెళ్లినట్టు గుర్తింపు



ధర్మవరం అగ్రహారం వద్ద వరహానదిలో గాలింపు చర్యలు చేపడుతున్న దృశ్యం

ఎస్. రాయవరం, జనవరి 8: మండలంలోని ధర్మవరం అగ్రహారం వద్ద సోమవారం ఉదయం వరహానదిలో దూకి ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడనే అనుమానంతో పోలీసులు నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఇందుకు సంబంధించి ఎస్ఐ ప్రసాదరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ధర్మవరం అగ్రహారం వద్ద వరహానది బ్రిడ్జిపై ఎస్.రాయవరానికి చెందిన ఉల్లి మణికంఠ అనే వ్యక్తి పేరుతో సూసైడ్ లెటర్, ఓ బ్యాగ్, చెప్పులు ఉండడంతో వాటిని గమనించిన స్థానికులు నదిలో దూకి ఆయన ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడేమో అన్న అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ ప్రసాదరావు ఆ ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. గజ ఈతగాళ్లు నదిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలించినా ఆచూకీ లేదు. ఈ విషయాన్ని టీవీలు, వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టడంతో మణికంఠ భార్య భూలక్ష్మి తెలుసుకొని వరహానది బ్రిడ్జి వద్దకు చేరుకొంది. అయితే ఎంత వెతికినా మణికంఠ ఆచూకీ లేకపోవడంతో ఎస్ఐ అక్కడికి సమీపంలో ఉన్న సీసీ కెమెరా పుటేజీని పరిశీలించారు. ఆ వ్యక్తి తన చెప్పులు, బ్యాగ్, లెటర్‌తో పాటు సెల్‌ఫోన్ బ్రిడ్జి వద్ద ఉంచి, నదిలో దూకకుండా తుని వైపు నడిచి వెళుతూ కనిపించాడని ఎస్ఐ ప్రసాదరావు చెప్పారు. అయితే మణికంఠ గతంలో బెట్టింగ్‌లు, యాప్‌లోన్స్ ద్వారా అప్పులపాలయ్యాడని, అప్పుల వలన గతంలో ఇంటిలో ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు అతడి భార్య భూలక్ష్మి చెప్పినట్టు పోలీసులు తెలిపారు. మణకంఠ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ప్రసాదరావు చెప్పారు.

25 మద్యం సీసాలతో ముగ్గురిపై కేసు

ఎలమంచిలి, జనవరి 8: పట్టణంతో పాటు మండల పరిధి ములకలాపల్లి గ్రామ శివారులో మూడు వేర్వేరు చోట్ల 25 మద్యం సీసాలతో ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ పాపినాయుడు తెలిపారు. ములకలాపల్లి శివారున పైడిరాజు వద్ద 9, పట్టణంలోని బస్టాండ్ వద తురంగల పాలెంకు చెందిన ఎ.సత్యనారాయణ వద్ద 7 , ఎస్.వెంకటరమణ వద్ద 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొన్నట్టు ఆయన చెప్పారు. వీరి ముగ్గురిపైన కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పాపినాయుడు తెలిపారు.

జూడో క్రీడా సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

తుమ్మపాల(అనకాపల్లి), జనవరి 8 : జిల్లా జూడో క్రీడా సంఘం నూతన కార్యవర్గం ఎన్ని క సోమవారం కోడూరులో జరిగింది. ఉమ్మడి విశాఖ జిల్లా జూడో క్రీడా సంఘం అధ్యక్షుడు డాక్టర్ పాడ్రంగి రుక్మాకరరావు నేతృ త్వంలో జరిగిన ఈ ఎన్నికలో అధ్య క్షుడిగా వనం సన్యాసిరావు, ఉపా ధ్యక్షుడిగా గొట్టాపు బలరాంనాయుడు, కార్యదర్శిగా రాకోటి సిమ్యోనూ, ఉప కార్యదర్శిగా సేనాపతి ప్రసాద్, కోశాధికారిగా గొరపల్లి దేవి వరలక్ష్మి, ఉప కోశాధికారిగా యల్లబిల్లి రాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లాలో యువత జూడోపై ఆసక్తి నెలకొల్పేందుకు కార్యవర్గమంతా కృషి చేస్తామని తీర్మానం చేశారు.

ల్యాండ్ పూలింగ్‌లో అక్రమ రిజిస్ట్రేషన్లు

» కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వీజేపాలెం సర్పంచ్

కొత్తూరు, జనవరి 8: అనకాపల్లి మండలం వేటజంగాల పాలెం రెవెన్యూ సర్వే నంబరు 50లో చేపట్టిన ల్యాండ్ పూలింగ్‌లో అక్రమాలు జరిగాయని, వాటిపై వెంటనే విచారణ జరిపించాలని అధికార పార్టీకి చెందిన సర్పంచ్ గూనా నాగరాజు (అరవింద్) డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు ఆయన జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి స్పందనలో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులకు, పంచాయతీ, సర్పంచ్‌కు తెలియకుండా వీఆర్‌వో బి.శ్రీనివాసరావు, సర్వేయర్ వర్మల ఆధ్వర్యంలో ఈ అక్రమాలన్నీ జరిగాయన్నారు. వీరి వెనుక డిప్యూటీ తహసీల్దార్ కూడా ఉన్నారని ఆరోపించారు. ఎవరికీ తెలియకుండా నక్కపల్లి తీసుకువెళ్లి సుమారు 20 పేర్లతో అక్రమంగా డి పట్టా భూములుగా రిజిస్ట్రేషన్ చేయించారని వివరించారు. వారిలో తేలపోలు గోవిందరావు, బొడ్డు కాసులు, బొడ్డు సత్యనారాయణ, మడక లక్ష్మి, సేనాపతి వెంకటలక్ష్మి, నిరుజోగి మహాలక్ష్మి ఉన్నారని ఫిర్యాదు చేశారు. వెంటనే గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి, విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

గౌరీ సంఘం కమిటీ ప్రమాణ స్వీకారం

అనకాపల్లి టౌన్, జనవరి 8 : స్థానిక గౌరీ పంచాయతన ఆలయంలో గౌరీ సేవా సంఘం, అనుబంధ సంఘాల కమిటీ పాలకవర్గాలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశాయి. గౌరీ సంఘం నూతన అధ్యక్షుడిగా కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శిగా బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారిగా శరగడం జగదీష్‌తో పాటు 22 మంది సభ్యులు, అలాగే కొణతాల సుబ్రహ్మణ్యం ఏసీ కల్యాణ మండపం కన్వీనర్‌గా ఆళ్ల మహలక్ష్మినాయుడు, అయ్యప్ప ఆలయ కన్వీనర్‌గా మళ్ల సూర్యప్రకాశరావు, మళ్ల జగన్నాథం కల్యాణ మండపం నిర్మాణ కమిటీ కన్వీనర్‌గా పెంటకోట సుబ్రహ్మణ్యం, కో-కన్వీనర్‌గా బుద్ద రమణాజీలచే వర్తకసంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. వీరిని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్కరించారు.

వాసవీక్లబ్ వనిత కార్యవర్గం ప్రమాణ స్వీకారం

అనకాపల్లి టౌన్, జనవరి 8 : స్థానిక వైఎంవీఏ హాల్‌లో సోమవారం వాసవీ క్లబ్ వనిత నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. అధ్యక్షురాలుగా జంగాల ఫణి, కార్యదర్శి జి. సువర్ణ, కోశాధికారిగా డి. సునీతలచే వాసవీ క్లబ్ గవర్నర్ వై. నరసింగరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వాసవీ క్లబ్ పాస్ట్ గవర్నర్ పీఎస్ వరహాలరావు మాట్లాడుతూ ఈ ఏడాది నూతన కార్యవర్గం సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కొల్లూరి పూర్ణిమా, కడిమిశెట్టి వీవీ స్వామి, శ్రీనాథ్ మాధవ్, వి. వెంకటరాజు, కె.కవిత, ఎం.పద్మజా పాల్గొన్నారు.

జాబ్ కేలండర్ విడుదల చేయాలని కలెక్టర్‌కు వినతి

సబ్బవరం, జనవరి 8 : ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది జాబ్ కేలండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పీబీవీఎస్ఎన్ రాజు, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాతూ.. రాష్ట్రంలో నిరుద్యోగ యవత జాతీయ స్థాయి కంటే రెండున్నర శాతం పెరిగిపోయారన్నారు. 2019లో నాటికి రాష్ట్రంలో 4 శాతం ఉన్న నిరుద్యోగ యువత 2023 నాటికి 6.6 శాతానికి చేరుకుందన్నారు. టీడీపీ హయాంలో రెండు సార్లు డీఎస్సీ నిర్వహించి 18 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలను వెళ్లగొట్టి యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారన్నారు. కార్య క్రమంలో తెలుగు యువత నాయకులు డి నాయుడు, ఆకుల గణేష్, యడ్ల రమేష్, సునీల్, రవికుమార్, నమ్మి నరసింగరావు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ఎలమంచిలి, జనవరి 8 : ఎలమంచిలి ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్ వరకూ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు ఇరుపక్కలా ఉన్న గ్రావెల్‌ను తొలగించారు.

కోటవురట్ల పంచాయతీ కార్యదర్శి మృతి



సుబ్రహ్మణ్యం

కోటవురట్ల, జనవరి 8: స్థానిక మేజర్‌పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈయన జూన్ నెలలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈయన స్వగ్రామం గొలుగొండ మండలం అమ్మపేట. ఉద్యోగ రీత్యా నర్సీపట్నంలో నివాసం ఉంటున్నారు. సోమవారం సెలవు పెట్టి తల్లి అనారోగ్యంగా ఉండడంతో నర్సీపట్నం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. అక్కడ ఆమెకు వైద్యసేవలు అందించిన అనంతరం తల్లిని కారులో ఇంటికి వెళుతుండగా సుబ్రహ్మణ్యం కారులోనే ప్రాణాలు విడిచారు. కారులో గుండెపోటు వచ్చి మృతి చెంది ఉంటారని కుటుంబసభ్యులు అనుమానిస్తున్నారు. ఈయనకు భార్య ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరికీ వివాహాలు అయ్యాయి. ఈ మరణ వార్త విన్న వెంటనే పంచాయతీల కార్యదర్శులు, ఎంపీడీవో, సిబ్బంది కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంగళవారం అమ్మపేటలో అంత్యక్రియలు జరగనున్నాయి.

తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

మునగపాక, జనవరి 8 : సాగునీటి కాలువ గట్టును ఆక్రమించి అక్రమ నిర్మాణం సాగిస్తున్న ఘరానా వ్యక్తికి రెవెన్యూ సిబ్బంది సహకరిస్తున్నారంటూ ఆగ్రహంతో సోమవారం రైతులు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. మునగపాక మెయిన్‌రోడ్ పక్కన కృష్ణంరాజు కాలువ గట్టును ఒక వ్యక్తి ఆక్రమించి అక్రమ నిర్మాణం సాగిస్తున్నారని, ఈ విషయమై ఫిర్యాదు చేసినా స్పందించలేదంటూ రైతులు ఆరోపించారు. తహసీల్దార్ వినయ్ వచ్చి రైతులను సమస్య అడిగి తెలుసుకున్నారు. ఆక్రమణదారునికి తక్షణమే నోటీస్ ఇచ్చి ఆక్రమణ రుజువైతే చర్యలు తీసుకుంటామని చెప్పడంతో రైతులు శాంతించారు. ఈ కార్యక్రమంలో పలు మూలసంఘాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

'జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి గెలుపే ధ్యేయం'

రాంబిల్లి, జనవరి 8 : వచ్చే ఎన్నికల్లో ఎలమంచిలి నియోజకవర్గంలో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి గెలుపే ధ్యేయంగా పనిచేయాలని జనసేన రాంబిల్లి, అచ్యుతాపురం మండల శాఖల అధ్యక్షులు పప్పల నూకన్నదొర, భైలపూడి రామదాసు, నియోజకవర్గం యువనేత లాలం చందు పిలుపునిచ్చారు. సోమవారం హరిపురం జనసేన పార్టీ కార్యాలయంలో మండల కోర్ కమిటీ సమావేశంలో వారు పంచాయతీల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలు విసుగు చెందుతున్నారన్నారు. సమావేశంలో జనసేన నేతలు చోడిపల్లి ప్రసాద్, సర్వేశ్వరరావు, మంగరాజు, కోర్‌కమిటీ సభ్యులు ఉన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నూకఅప్పారావు



తుమ్మపాల, జనవరి 8 : కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి మండల అధ్యక్షుడుగా కట్టమూరి నూకఅప్పారావు నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు ఆదేశాలు జారీ చేశారు. మండలంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేయడంతో పాటు కార్యకర్తలకు అండగా ఉంటానని ఆయన చెప్పారు.

అంగన్‌వాడీలు వినూత్న నిరసన

»ఎస్మాపై మండిపాటు.. »పాయకరావుపేటలో నల్లబెలూన్లు ఎగరవేత.. »పరవాడలో మోకాళ్లపై... » నక్కపల్లిలో గడ్డి తింటూ ఆందోళన



పాయకరావుపేటలో నల్ల బెలూన్లతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



నక్కపల్లిలో శిబిరం వద్ద గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

పాయకరావుపేట, జనవరి 8 : సమస్యలు పరిష్కారం కోరుతూ ఆందోళన చేస్తున్న తమపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడాన్ని నిరసిస్తూ అంగన్‌వాడీలు సోమవారం నల్ల బెలూన్లు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ఆందోళన విరమించేదిలేదని తెలిపారు. యూనియన్ నాయకులు బి.నాగేశ్వరరావు, నూకరత్నం, సత్యవేణి, జ్యోతి, ఎస్‌వీఆర్‌ఏ.రాజేశ్వరి పాల్గొన్నారు.

కలెక్టరేట్: అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె సోమవారానికి 28వ రోజుకు చేరింది. అంగన్‌వాడీల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 24 గంటల దీక్షను శంకరంలోని కలెక్టరేట్ వద్ద కొనసాగిస్తున్నారు. 15 మంది అంగన్‌వాడీలు నిరాహారదీక్ష చేపట్టారు. అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం అన్యాయమని పలువురు వక్తలు అన్నారు.

పరవాడలో.. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె సోమవారం 28వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మోకాళ్లపై నిల్చొని దండం పెడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన సర్క్యులర్‌ను దహనం చేశారు. ఈ ఆందోళనలో యూనియన్ నాయకులు ఎం.రమణి, సుజాత, వెంకటలక్ష్మి, కృష్ణవేణి, కుమారి పాల్గొన్నారు. కాగా అంగన్‌వాడీల సమ్మెకు టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న మద్దతు ప్రకటించారు.

సబ్బవరంలో.. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 28వ రోజు సోమవారం కొనసాగింది. ఈసందర్భంగా ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు వీవీ రమణమ్మ మాట్లాడుతూ.. ప్రభుత్వం మొండి వైఖరి వీడి తమ డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో డి.పుష్పవతి, రామలక్ష్మి, ఎస్.జగదేశ్వరి, ఎం.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పరవాడలో మోకాళ్లపై నిలబడి దండం పెడుతూ అంగన్‌వాడీల నిరసన

అనకాపల్లి టౌన్: అంగన్‌వాడీల సమ్మె 28వ రోజు సోమవారం కూడా కొనసాగింది. అంగన్‌వాడీలు నెహ్రూచౌక్‌లోని బస్టాప్ పక్కన ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసుకొని ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు ఉమా నారాయణమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

కోటవురట్లలో.. అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం నాటికి 28వరోజుకు చేరింది. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నా చేస్తున్నారు. తమపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని వారు ఖండించారు. జీవో-2ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నక్కపల్లిలో.. అంగన్‌వాడీలు సోమవారం వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. దీక్షా శిబిరం వద్ద గడ్డి తింటూ నిరసన తెలిపారు. తాము 28 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని, పైగా ఎస్మా ప్రయోగించడాన్ని వారు ఖండించారు.

చెవిలో పువ్వులు పెట్టుకుని మునిసిపల్ కార్మికుల నిరసన

ఎలమంచిలి, జనవరి 8: ఎలమంచిలిలో మునిసిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు సోమవారం 7వ రోజు సమ్మెలో భాగంగా చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసనను వ్యక్తం చేశారు. మునిసిపల్ కార్యాలయం వద్ద నిరసన శిబిరంలో డిమాండ్లు నెరవేరేదాకా నిరవధిక సమ్మె కొనసాగిస్తామని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా మునిసిపల్ వర్కర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని పరిరక్షించే పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎలమంచిలిలో చెవిలో పువ్వులు పెట్టుకుని 6 వ రోజు సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు

14వ రోజుకు...

అనకాపల్లి టౌన్, జనవరి 8 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మె సోమవారం 14వ రోజు కొనసాగింది. జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలియజేశారు. పారిశుధ్య కార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

'పోలీసులతో గృహ నిర్బంధాలు సిగ్గుచేటు'

తుమ్మపాల, జనవరి 8 : న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో గృహ నిర్బంధాలకు పాల్పడడం సిగ్గుచేటని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి వియ్యపురాజు మండిపడ్డారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విజయవాడ ధర్నాచౌక్‌లో సోమవారం జరుగుతున్న ధర్నాకు వెళ్లకుండా పోలీసులు నిలువరించడంతో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట ఇచ్చి మడమ తిప్పనని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో నిరుద్యోగులంతా జగన్మోహన్‌రెడ్డికి గట్టి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

సౌత్ ఇండియా పోటీలకు ఎంపికైన టీచర్‌కు సత్కారం

ఎస్.రాయవరం, జనవరి 8: సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కి ఎంపికైన కొరుప్రోలు జడ్పీ హైస్కూల్ టీచర్ రాయుడు రఘురమేష్‌ను సోమవారం పీఆర్‌టీయూ మండల నాయకులు సత్కరించి, అభినందించారు. అలాగే ఆయన్ను ప్రోత్సాహించిన హెచ్‌ఎం సత్యనారాయణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, సెక్రటరీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

20వ రోజుకు చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

అనకాపల్లి రూరల్, జనవరి 8 : జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె సోమవారానికి 20వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా జేఏసీ పిలుపు మేరకు ప్రతి ఒక్క వింగ్ నుంచి ఉద్యోగులు తరలివచ్చి ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు కృష్ణ, వెంకటరావు పాల్గొన్నారు.

10న చలో సీఎం కార్యాలయం ముట్టడి

అనకాపల్లి టౌన్, జనవరి 8 : మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన జరిగే చలో సీఎం కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ పిలుపునిచ్చారు. సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా డీఎస్సీపై ప్రకటనలే తప్ప ఏనాడు ప్రకటించలేదన్నారు. అందుకే సీఎం కార్యాలయ ముట్టడికి చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎ.రాజు, పాంగి చలపతి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా చలో సీఎం కార్యాలయ ముట్టడి విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సీఐటీయూ కార్యాలయానికి వచ్చి డీవైఎఫ్ఐ ప్రతినిధులను అదుపులోకి తీసుకున్నారు. అయితే డీవైఎఫ్ఐ నుంచి ఒక్కరినే అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

రాజాధిరాజ వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ

నక్కపల్లి, జనవరి 8: మండలంలోని ఉపమాకలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాజాధిరాజ వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని రాజాధిరాజ వాహనంపై అలంకరించి, పూజలు చేసి హారతులిచ్చారు.పల్లకీపై గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాడవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు,నండూరి వెంకట రాజ గోపాలాచార్యులు పాల్గొన్నారు.


రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన ఘనత జగన్‌రెడ్డిదే : పీలా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, జనవరి 8 : రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిదేనని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల ఆత్మహత్యలు చేసుకోవడంలో రాష్ట్రం ప్రతమ స్థానంలో నిలిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌రెడ్డి పాలనలో యువత భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. సుజల స్రవంతిని పక్కన పెట్టి ఉత్తరాంధ్ర రైతులకు ద్రోహం చేసిన ఘనుడు జగన్‌రెడ్డి అని అన్నారు. వైసీపీ పాలనలో ఒక్క డీఎస్సీ గాని, గ్రూప్-1,2,3 నోటిఫికేషన్లు గాని ఇవ్వలేదన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇప్పుడు దొంగ ఏడుపు ఏడుస్తూ ప్రజల సానుభూతిని పొందేందుకు ప్రయత్నిస్తున్నా రన్నారు. నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించిన ఏకైక వ్యక్తి గుడివాడ అమర్‌నాథ్ అని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, పచ్చికూర రాము, కర్రి బాబి, కరణం రమణ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సమస్యలపై తల్లిదండ్రుల నిరసన



గురుకుల పాఠశాల వద్ద నిరసన తెలియజేస్తున్న తల్లిదండ్రులు

తుమ్మపాల, జనవరి 8 : గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం తగదనిపాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. సోమవారం గవరపాలెంలో గల మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల వద్ద వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత పాఠశాల ఆవరణలో జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో తల్లిదండ్రులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రధానంగా గురుకులం అరకొర వసతులతోనే నడుస్తున్నప్పటికీ నాయకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పాఠశాలకు సొంతగూడు లేదని, ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురై ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పాఠశాల గదుల్లో బెంచీలు పాడయ్యాయని, గ్రంథాలయం, ల్యాబ్ వంటి సౌకర్యాలు లేవన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్, తల్లిదండ్రులు గొర్లి నాయుడు, బత్తుల రాజారావు, నీలిమా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పి.బోనంగి, కలపాక గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

పరవాడ, జనవరి 8 : మండలంలోని పి.బోనంగి, కలపాక గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లి రామునాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో సీహెచ్. చంద్రావతి, బీజేపీ నాయకులు సోమశేఖర్, రామకృష్ణ, ప్రసాద్, బండారు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి రెఢీ

... 5వ పేజీ తరువాయి

వాగులో లేదా చెరువులో గంటకుపైగా ఈత కొట్టిస్తారు. తరువాత కోడికి విశ్రాంతి ఇచ్చి, సాయంత్రం కుంకుడు, యూకలిప్టస్, వెదురు ఆకులను వేడినీటిలో మరిగించి, నీరు గోరువెచ్చగా వున్నప్పుడు ఆ నీటితో కోడికి స్నానం చేయిస్తారు. తరువాత ఆవిరి (వేడి) గుడ్డతో మసాజ్ చేస్తారు. కోడిపుంజు ఒంట్లో కొవ్వు లేకుండా చూసేందుకు నువ్వులు, పసుపు కలిపిన ఆహారాన్ని మధ్యమధ్యలో ఇస్తారు.

వ్యాపారంగా పందెం పుంజుల పెంపకం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొంతమంది వ్యక్తులు పందెం పుంజుల పెంకాన్ని వ్యాపారంగా మార్చుకున్నారు. ఇక్కడ కంటే గోదావరి జిల్లాలో పందెం కోడి పుంజులకు మంచి గిరాకీ వుండడంతో అక్కడ నిర్వహించే పందేలకు అనుగుణంగా పెంచుతూ, పందాలకు తర్ఫీదు ఇస్తుంటారు. పందెం పుంజులను నిరంతరం పెంచుతూ వుంటారు. సంక్రాంతికి ముందు గోదావరి జిల్లాల నుంచి పలువురు ఇక్కడకు వచ్చి కోడి పుంజులను కొనుక్కొని తీసుకెళుతుంటారు. కొందరు సంక్రాంతి పండగకు ఆరేడు నెలల ముందుగానే వచ్చి పుంజులు కొంటుంటారు. కోడిపుంజు రకం, వాటి సామర్థ్యాన్ని బట్టి ఒక్కొక్కటి తక్కువలో తక్కువ రూ.10 వేలు, గరిష్ఠంగా లక్ష రూపాయలు పలుకుతుంది.

పెందుర్తి నుంచి అమర్‌కు చాన్స్?

... 5వ పేజీ తరువాయి

మంత్రి అమర్‌నాథ్ ఎలమంచిలి నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపగా, అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కన్నబాబురాజు తీవ్రంగా వ్యతిరేకించారు. ఒకవేళ తనకు టికెట్ ఇవ్వకుండా వేరెవరికి ఇచ్చినా వారి ఓటమిని కృషిచేస్తానని పార్టీ ముఖ్య నేతలకు ఆయన తేల్చిచెప్పడంతో మంత్రి అమర్‌నాథ్ వెనకడుగు వేసినట్టు చెబుతున్నారు. రెండో ప్రాధాన్యంగా చోడవరం నుంచి పోటీకి మంత్రి అమర్‌నాథ్ ఆసక్తి చూపారు. తనను తొలగించి ఎవరికి టికెట్ ఇచ్చినా వారి విజయానికి సహకరిస్తానని, తన సామాజికవర్గానికి చెందిన మంత్రి అమర్‌నాథ్‌కు ఇస్తానంటే మాత్రం తాను అంగీకరించబోనని సిట్టింగ్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పార్టీలో కీలక నేతకు స్పష్టంచేసినట్టు చెబుతున్నారు. దీంతో విధిలేని పరిస్థితిలో పెందుర్తి నుంచి పోటీకి అనుమతించాలని మంత్రి అమర్‌నాథ్ అధిష్ఠానాన్ని కోరారంటున్నారు. గతంలో తన తాత అప్పన్న, తండ్రి గురునాథరావు కూడా పెందుర్తి నుంచే పోటీ చేసి గెలిచినందున తనకు అక్కడ నుంచి పోటీకి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌పై వ్యతిరేకత ఉందంటూ అతడిని మార్చే ప్రతిపాదన అధిష్ఠానం వద్ద ఉండడం..అమర్‌నాథ్‌కు కలిసొచ్చినట్టయిందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇదిలావుండగా గుడివాడ అమర్‌నాథ్‌కు పెందుర్తి టికెట్ కేటాయించనున్నారనే ప్రచారం సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శిబిరంలో కలవరం రేపుతోంది. మరి..అదీప్‌రాజ్‌ను ఎక్కడ నుంచి పోటీకి దింపుతారని ఆయన అనుచరులు ప్రశ్నిస్తున్నారు. ఆయన్ను కాకుండా వేరెవరినో తమపై రుద్దితే వారి విజయానికి తాము పనిచేసేది లేదని అంటున్నట్టు సమాచారం.

అసకపల్లిలో గెడ్డ వాగు కబ్జా

... 5వ పేజీ తరువాయి

రోడ్డు నిర్మించారు. గెడ్డను ఆక్రమించి, యథేచ్ఛగా చెట్లను నరికివేసినప్పటికీ ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు ఇటువైపు కన్నెత్తి అయినా చూడలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. కాగా ఇదే అదనుగా భావించిన కొంతమంది స్థానికులు గెడ్డ వాగులో మిగిలిన స్థలాన్ని ఆక్రమించి రేకుల షెడ్లు వేస్తున్నారు.

అసకపల్లిలో మరికొన్ని ఆక్రమణలు

సర్వే నంబరు 16లోని ప్రభుత్వ భూమి బంద(నీటి వనరు)ను చదును చేసి షెడ్లు నిర్మించారు. స్థానికులు ఫిర్యాదు చేసిన సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. సర్వే నంబరు 26లో వాగు పోరంబోకు సుమారు నాలుగు ఎకరాలు వుంది. దీని నుంచి సంగడాల చెరువుకు వర్షం నీరు చేరుతుంది. ఈ గెడ్డను పూడ్చివేసి రోడ్డు వేశారు. దీనిపై పత్రికల్లో కథనాలు వచ్చిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. ఇరువాడ సర్వే నంబరు 131లో 7.02 ఎకరాలు, సర్వే నంబరు 148లో 5.75 ఎకరాల్లో గెడ్డ వాగులు ఉన్నాయి. ఇవి కూడా ఆక్రమణకు గురయ్యాయి.

వాల్టాకు తూట్లు

ఆంధ్రప్రదేశ్ వాటర్, ల్యాండ్, ట్రీస్ యాక్ట్-2004- వాల్టా' చట్టం ప్రకారం రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా ఒక్క చెట్టు కూడా నరకకూడదు. ఒకవేళ చెట్లను నరకాలంటే రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు అనుమతులు ఉండాలి. అదే విధంగా సహజ నీటి వనరులను ధ్వంసం చేయకూడదు. నీటి వనరుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి. మండల స్థాయిలో కమిటీ ఏర్పాటు చేసి నెలకోసారి సమావేశమై చట్టం అమలను పర్యవేక్షించాలి. కానీ మండలంలో ఈ చట్టం కనీసస్థాయిలో కూడా అమలు కావడం లేదు.

ఓటర్ల తుది జాబితాలపై కసరత్తు!

... 5వ పేజీ తరువాయి

తరువాత జాబితా నుంచి పేర్లు తొలగిస్తున్నారు. డూప్లికేట్, ఓటు బదిలీ దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తున్నారు. ముసాయిదా జాబితాలపై ఇంకా ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 12వ తేదీలోగా అర్జీలు అందజేయడానికి అవకాశం కల్పించారు. వీటిని 17వ తేదీలోగా పరిష్కరించి, 22వ తేదీ తుది ఓటరు జాబితాలను విడుదల చేస్తారు.

సీపీఎం నేత బాలకృష్ణకు ఘన నివాళులు



బాలకృష్ణ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్ జనవరి 8 : స్థానిక నెహ్రూచౌక్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు దూలం బుసిరాజు ఆధ్వర్యంలో దివంగత సీపీఎం నాయకుడు ఎ.బాలకృష్ణ సంతాప సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వైఎస్ భద్రం, సీపీఎం నాయకులు గంటా శ్రీరామ్, దాకారపు శ్రీనివాస్, బీజేపీ నాయకులు చదరం నాగేశ్వరరావు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కొత్తూరు(అనకాపల్లి), జనవరి 8: జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం గవరపాలెం రైతు భారతి కల్యాణ మండపంలో జరిగింది. అధ్యక్షునిగా మళ్ల మాణిక్యాలు, ఉపాధ్యక్షునిగా డీవైడీపీ సతీష్, కార్యదర్శిగా నంబారు హేమసాయి, సహాయ కార్యదర్శులుగా కేదారశెట్టి ప్రవల్లిక, బొడ్డేటి చంద్రమౌళి, కోశాధికారిగా సూరిశెట్టి హృదయ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆళ్ల ప్రవీణ్‌కుమార్, సలహాదారునిగా శిలపరశెట్టి బాబి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరందరినీ రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి వి.వెంకటరమణ అభినందించారు. అనంతరం వెంకటరమణను శాలువాతో సత్కరించారు.

మేలుకొలుపు భక్తులకు చీరలు పంపిణీ

పరవాడ, జనవరి 8 : సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాయుడుపాలెంలో నిర్వహిస్తున్న మేలుకొలుపులో పాల్గొన్న మహిళా భక్తులకు వీఆర్వో కూండ్రపు శ్రీనివాసరావు, మధు దంపతులు చీరలు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు అప్పలనాయుడు, దుంగల అప్పారావు, కడిమిశెట్టి శ్రీనివాసరావు, రాజు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు



ప్రత్యేక చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నక్కపల్లి, జనవరి 8: మండలంలోని వేంపాడు హైవే టోల్ ప్లాజా వద్ద సోమవారం వాహనాల తనిఖీకి ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా ఈ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణరావు పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది తుని, విశాఖ మధ్య రాకపోకలు సాగించే పలు వాహనాలను తనిఖీ చేశారు. ఇది తాత్కాలికంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ మాత్రమేనని ఎస్ఐ విభీషణరావు చెప్పారు.

అంబేడ్కర్ మహోన్నతమైన వ్యక్తి : చిక్కాల

పాయకరావుపేట రూరల్, జనవరి 8: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహోన్నత వ్యక్తి అని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. ఈనెల 19వ తేదీన విజయవాడలో అంబేడ్కర్ మహా శిల్పం ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం పెంటకోటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అంబేడ్కర్ భారత జాతికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ చేపల నాగమణి, ఉప సర్పంచ్ చిక్కాల సూర్యనారాయణ, వైసీపీ నాయకులు చేపల తాతాజీ, వార్డు మెంబర్లు, ఈవోపీఆర్‌డీ చంద్రశేఖర్, కార్యదర్శులు వైవీ. సత్యనారాయణ, మూర్తి పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు మోడల్ టెస్టు పుస్తకాలు పంపిణీ

పాయకరావుపేట రూరల్, జనవరి 8: మండలంలోని పెంటకోట జడ్పీ హైస్కూల్‌లో సోమవారం సత్యసాయిబాబా ట్రస్టు సభ్యులు కృష్ణంరాజు సమకూర్చిన పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్టు పుస్తకాలను జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సూర్యనారాయణ, ఉపసర్పంచ్ చిక్కాల సూర్యనారాయణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బుద్ధుడుగా పాండురంగడు



బుద్ధావతారంలో..

పాయకరావుపేట, జనవరి 8: స్థానిక పాండురంగస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పాండురంగస్వామివారు బుద్ధుడుగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున స్వామి వారికి సుప్రభాతసేవ, విశేష పూజల అనంతరం ప్రధానార్చకులు కృష్ణస్వామి పాండురంగ స్వామివారికి నూతన వస్త్రాలు, కమండలంతో బుద్ధుడి అవతారంలో అలంకరించారు. భక్తులు స్వామి దర్శించి అభిషేకాలు, పూజలు చేశారు.

పూడిమడక సర్పంచ్ భర్తపై ఫిర్యాదు

అచ్యుతాపురం, జనవరి 8: పూడిమడక సర్పంచ్ భర్త వెంకటరమణ జగనన్న కాలనీకి సేకరించిన భూమిని ఇతరులకు విక్రయించాడంటూ గ్రామ మాజీ ఉపసర్పంచ్ చోడిపల్లి అప్పారావు కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశారు. పూడిమడక సర్వే నంబరు 114/2లో ప్రభుత్వ భూమిని జగనన్న కాలనీకి కేటాయించారు. అయితే అర్హుల జాబితా నుంచి తనకు అనుకూలంగా లేని వారిని వెంకటరమణ తప్పించేశారు. మిగిలిన ఇళ్ల స్థలాలను ఇతరులకు విక్రయించేశాడని, దీనికి రెవెన్యూ అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందించారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

బీసీ సభ కాదు.. బీజేపీ భజన సభ : చందు

మునగపాక, జనవరి 8 : బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగినది బీసీ సభ కాదని, బీజేపీ భజన సభ అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు విమర్శించారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ బీజేపీ నాయకులు బీసీలను ఉద్ధరించినట్టు ప్రసంగాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీసీలపై బీజేపీ కపట ప్రేమ చూపుతుందన్నారు.

చెరకు యంత్రంపై డెమో

మునగపాక, జనవరి 8: అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం పరిశోధకులు సోమవారం మునగపాకలో వ్యవసాయ పనిముట్ల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యంగా చెరకు రైతులకు ఉపయోగపడే యంత్రం పనితీరును వివరించడమే కాకుండా ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఆర్ పి.జగన్నాథరావు మాట్లాడుతూ.. ట్రాష్ ష్రెడ్డర్ యంత్రంతో చెరకు నరికిన తర్వాత మడిలో తేమ తగ్గకుండా ఉండడంతో పాటు కార్శి వచ్చేటపుడు చెరకు మొదళ్లు ఎండిపోకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సర్పంచ్ దిమ్మల అప్పారావు, శాస్త్రవేత్త శ్రీదేవి, ఏడీఏ ఎం.రామారావు, ఏవో జ్యోత్స్నకుమారి పాల్గొన్నారు.

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ క్లబ్ ప్రారంభం

ఎస్.రాయవరం, జనవరి 8: మండలంలోని దార్లపూడి జడ్పీ హైస్కూల్‌లో సోమవారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ క్లబ్‌ను ప్రారంభించినట్టు ఆ పాఠశాల హెచ్‌ఎం ఎం. రమణశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ క్లబ్‌ను మంజూరు చేసిందన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో టీచర్ క్లబ్ మెంటార్ ఎ. రాము, దాసు, సోమేశ్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి మంచిరోజులు

▸ టీడీపీ శ్రేణుల సమావేశంలో మాజీ మంత్రి అయ్యన్న సతీమణి పద్మావతి



చోద్యంలో పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడుతున్న చింతకాయల పద్మావతి

గొలుగొండ/ కృష్ణాదేవిపేట, జనవరి 8 : రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా అంతా పనిచేయాలని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సతీమణి, మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి పిలుపునిచ్చారు. మండలంలోని చోద్యంలో పార్టీ ముఖ్య నాయకులతో సోమవారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. మళ్లీ ఆంధ్రాకు మంచిరోజులు రావాలంటే చంద్రబాబు వంటి సమర్థ నాయకుడితోనే సాధ్యమన్నారు. ఇందులో భాగంగానే ఆయన బడుగు, బలహీన వర్గాలకు మేనిఫెస్టోలో పెద్దపీట వేశారని పేర్కొంటూ ఆయా పథకాలను వివరించారు. గ్రామ గ్రామాన బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. సంక్రాంతి పండగలోగా గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే, కొత్తఎల్లవరంలో అయ్యన్న తనయుడు, మునిసిపల్ కౌన్సిల్ రాజేష్ పార్టీ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలకు సంబంధించి కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశాల్లో చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, కొత్తఎల్లవరం సర్పంచ్ కొల్లి రాంబాబు, టీడీపీ నాయకులు కొల్లి సత్యనారాయణ, కొల్ల గోవింద్, శెట్టి శివకుమార్, కొల్లి రామకృష్ణ, ఆదపురెడ్డి ప్రభాకర్, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే రైతు రాజ్యం : బత్తుల

బుచ్చెయ్యపేట, జనవరి 8 : రైతు రాజ్యం చంద్ర బాబునాయుడుతోనే సాధ్యమని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు అన్నారు. సోమవారం వడ్డాదిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జగన్ రివర్స్ పాలనతో రాష్ట్రం ముప్పై ఏళ్ల వెనక్కి వెళ్లిపోయిందన్నారు. దీంతో అన్నివర్గాల ప్రజలు కష్టాల్లో పడ్డారని వాపోయారు. సమస్యలపై వివిధ శాఖల ఉద్యోగులు ఆందోళనలు చేపడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా అంశాన్ని జగన్ గంగలో కలిపేశారన్నారు. సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని సద్వినియోగం చేసుకోవడానికి సుజల స్రవంతి, పట్టిసీమ తదితర ప్రాజెక్టులను జగన్ నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వీటన్నింటినీ గమనిస్తున్న రాష్ట్రప్రజలు రానున్న ఎన్నికల్లో టీడీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఓటర్ల తుది జాబితాలపై కసరత్తు!

... 5వ పేజీ తరువాయి

తరువాత జాబితా నుంచి పేర్లు తొలగిస్తున్నారు. డూప్లికేట్, ఓటు బదిలీ దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తున్నారు. ముసాయిదా జాబితాలపై ఇంకా ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 12వ తేదీలోగా అర్జీలు అందజేయడానికి అవకాశం కల్పించారు. వీటిని 17వ తేదీలోగా పరిష్కరించి, 22వ తేదీ తుది ఓటరు జాబితాలను విడుదల చేస్తారు.

సంక్రాంతికి రె'ఢీ'

... 5వ పేజీ తరువాయి

వాగులో లేదా చెరువులో గంటకుపైగా ఈత కొట్టిస్తారు. తరువాత కోడికి విశ్రాంతి ఇచ్చి, సాయంత్రం కుంకుడు, యూకలిప్టస్, వెదురు ఆకులను వేడినీటిలో మరిగించి, నీరు గోరువెచ్చగా వున్నప్పుడు ఆ నీటితో కోడికి స్నానం చేయిస్తారు. తరువాత ఆవిరి (వేడి) గుడ్డతో మసాజ్ చేస్తారు. కోడిపుంజు ఒంట్లో కొవ్వు లేకుండా చూసేందుకు నువ్వులు, పసుపు కలిపిన ఆహారాన్ని మధ్యమధ్యలో ఇస్తారు.

వ్యాపారంగా పందెం పుంజుల పెంపకం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొంతమంది వ్యక్తులు పందెం పుంజుల పెంకాన్ని వ్యాపారంగా మార్చుకున్నారు. ఇక్కడ కంటే గోదావరి జిల్లాలో పందెం కోడి పుంజులకు మంచి గిరాకీ వుండడంతో అక్కడ నిర్వహించే పందేలకు అనుగుణంగా పెంచుతూ, పందాలకు తర్ఫీదు ఇస్తుంటారు. పందెం పుంజులను నిరంతరం పెంచుతూ వుంటారు. సంక్రాంతికి ముందు గోదావరి జిల్లాల నుంచి పలువురు ఇక్కడకు వచ్చి కోడి పుంజులను కొనుక్కొని తీసుకెళుతుంటారు. కొందరు సంక్రాంతి పండగకు ఆరేడు నెలల ముందుగానే వచ్చి పుంజులు కొంటుంటారు. కోడిపుంజు రకం, వాటి సామర్థ్యాన్ని బట్టి ఒక్కొక్కటి తక్కువలో తక్కువ రూ.10 వేలు, గరిష్ఠంగా లక్ష రూపాయలు పలుకుతుంది.

పెందుర్తి నుంచి అమర్‌కు చాన్స్?

... 5వ పేజీ తరువాయి

మంత్రి అమర్‌నాథ్ ఎలమంచిలి నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపగా, అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కన్నబాబురాజు తీవ్రంగా వ్యతిరేకించారు. ఒకవేళ తనకు టికెట్ ఇవ్వకుండా వేరెవరికి ఇచ్చినా వారి ఓటమిని కృషిచేస్తానని పార్టీ ముఖ్య నేతలకు ఆయన తేల్చిచెప్పడంతో మంత్రి అమర్‌నాథ్ వెనకడుగు వేసినట్టు చెబుతున్నారు. రెండో ప్రాధాన్యంగా చోడవరం నుంచి పోటీకి మంత్రి అమర్‌నాథ్ ఆసక్తి చూపారు. తనను తొలగించి ఎవరికి టికెట్ ఇచ్చినా వారి విజయానికి సహకరిస్తానని, తన సామాజికవర్గానికి చెందిన మంత్రి అమర్‌నాథ్‌కు ఇస్తానంటే మాత్రం తాను అంగీకరించబోనని సిట్టింగ్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పార్టీలో కీలక నేతకు స్పష్టంచేసినట్టు చెబుతున్నారు. దీంతో విధిలేని పరిస్థితిలో పెందుర్తి నుంచి పోటీకి అనుమతించాలని మంత్రి అమర్‌నాథ్ అధిష్ఠానాన్ని కోరారంటున్నారు. గతంలో తన తాత అప్పన్న, తండ్రి గురునాథరావు కూడా పెందుర్తి నుంచే పోటీ చేసి గెలిచి నందున తనకు అక్కడ నుంచి పోటీకి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌పై వ్యతిరేకత ఉందంటూ ఆతడిని మార్చే ప్రతిపాదన అధిష్ఠానం వద్ద ఉండడం..అమర్‌నాథ్‌కు కలిసొచ్చినట్టయిందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇదిలావుండగా గుడివాడ అమర్‌నాథ్‌కు పెందుర్తి టికెట్ కేటాయించనున్నారనే ప్రచారం సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శిబిరంలో కలవరం రేపుతోంది. మరి..అదీప్‌రాజ్‌ను ఎక్కడ నుంచి పోటీకి దింపుతారని ఆయన అనుచరులు ప్రశ్నిస్తున్నారు. ఆయన్ను కాకుండా వేరెవరినో తమపై రుద్దితే వారి విజయానికి తాము పనిచేసేది లేదని అంటున్నట్టు సమాచారం.

అసకపల్లిలో గెడ్డ వాగు కబ్జా

... 5వ పేజీ తరువాయి

రోడ్డు నిర్మించారు. గెడ్డను ఆక్రమించి, యథేచ్ఛగా చెట్లను నరికివేసినప్పటికీ ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు ఇటువైపు కన్నెత్తి అయినా చూడలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. కాగా ఇదే అదనుగా భావించిన కొంతమంది స్థానికులు గెడ్డ వాగులో మిగిలిన స్థలాన్ని ఆక్రమించి రేకుల షెడ్లు వేస్తున్నారు.

అసకపల్లిలో మరికొన్ని ఆక్రమణలు

సర్వే నంబరు 16లోని ప్రభుత్వ భూమి బంద(నీటి వనరు)ను చదును చేసి షెడ్లు నిర్మించారు. స్థానికులు ఫిర్యాదు చేసిన సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. సర్వే నంబరు 26లో వాగు పోరంబోకు సుమారు నాలుగు ఎకరాలు వుంది. దీని నుంచి సంగడాల చెరువుకు వర్షం నీరు చేరుతుంది. ఈ గెడ్డను పూడ్చివేసి రోడ్డు వేశారు. దీనిపై పత్రికల్లో కథనాలు వచ్చిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. ఇరువాడ సర్వే నంబరు 131లో 7.02 ఎకరాలు, సర్వే నంబరు 148లో 5.75 ఎకరాల్లో గెడ్డ వాగులు ఉన్నాయి. ఇవి కూడా ఆక్రమణకు గురయ్యాయి.

వాల్టాకు తూట్లు

ఆంధ్రప్రదేశ్ వాటర్, ల్యాండ్, ట్రీస్ యాక్ట్-2004- వాల్టా' చట్టం ప్రకారం రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా ఒక్క చెట్టు కూడా నరకకూడదు. ఒకవేళ చెట్లను నరకాలంటే రెవెన్యూ అటవీ శాఖ అధికారులు అనుమతులు ఉండాలి. అదే విధంగా సహజ నీటి వనరులను ధ్వంసం చేయకూడదు. నీటి వనరుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి. మండల స్థాయిలో కమిటీ ఏర్పాటు చేసి నెలకోసారి సమావేశమై చట్టం అమలును పర్యవేక్షించాలి. కానీ మండలంలో ఈ చట్టం కనీసస్థాయిలో కూడా అమలు కావడం లేదు.

సమస్యలపై పోరు... వినతుల హోరు..

ఆ జీవోను 'చూడం, చదవం, వినం'

▸ అంగన్‌వాడీ కార్యకర్తలు కళ్లు, నోరు, చెవులు మూసుకుని ఆందోళన



బుచ్చెయ్యపేట దీక్షా శిబిరంలో చెవులు, కళ్లు, నోరు మూసుకుని అంగన్‌వాడీల ఆందోళన

గొలుగొండ : డిమాండ్ల పరిష్కారానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధమని అంగన్‌వాడీ కార్యకర్తలు హెచ్చరించారు. ఇక్కడ చేపట్టిన దీక్షా శిబిరంలో సోమవారం గొలుగొండ, నాతవరం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్మా ప్రయోగించినా వెనుకడుగు వేసేది లేదని జిల్లా నాయకురాళ్లు మంగతాయారు, భ్రమరాంబ, ఆర్.వెంకటలక్ష్మి, సత్య తదితరులు హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లపై అంతా నినాదాలు చేశారు.

బుచ్చెయ్యపేట, జనవరి 8 : డిమాండ్ల సాధనకు సమ్మెకు దిగిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తున్నారు. ఇందులో భాగంగా బుచ్చెయ్యపేటలో సోమవారం వినూత్నంగా నిరసన తెలిపారు. సమ్మె విరమించాలని జారీ చేసిన జీఓను 'మేం చూడం, చదవం, వినం' అంటూ చెవులు, కళ్లు, నోరు మూసికుని ఆందోళన శిబిరంలో నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలను గుర్తించకుండా ఎస్మా ప్రయోగిస్తే బెదిరేది లేదని సంఘం నాయకురాలు ఎలిశెట్టి అమ్మాజీ, ఆది వరలక్ష్మి, కోవెల వెంకటలక్ష్మి స్పష్టం చేశారు.



గొలుగొండలో నినాదాలు చేస్తున్న రెండు మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు

'స్పందన' అర్జీలపై ప్రత్యేక దృష్టి : ఆర్డీవో



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం, జనవరి 8 : ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ మండలాల నుంచి పదకొండు మంది విచ్చేసి వినతి పత్రాలను సమర్పించారు. వీరందరితో ఆర్డీవో జయరాం స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మాకవరపాలెం మండలం మల్లవరంలోని సర్వే నెంబరు 79-3లో 0-35 సెంట్ల విస్తీర్ణం గల తన సొంత భూమిని వెబ్‌ల్యాండ్‌లో నూకవరపు పార్వతి పేరు మీద తప్పుడుగా నమోదు చేశారని సంబంగి శ్రీరాములు ఆర్డీవో వద్ద వాపోయారు. దీనిపై పలుమార్లు దరఖాస్తు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని జోగినాథునిపాలేనికి చెందిన రుత్తల చిన బంగార్రాజు వృద్ధాప్య పింఛను కోసం వినతి పత్రం అందజేశారు. ఇలా మరికొంతమంది విచ్చేసి సమస్యలను విన్నవించారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయా శాఖల అధికారులను ఆర్డీవో ఆదేశించారు.

పారిశుధ్య కార్మికులు వినూత్న నిరసన

▸ నడుముకు వేప కొమ్మలు కట్టుకొని పట్టణంలో ర్యాలీ

▸ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని నినాదాలు



వేప కొమ్మలు నడుముకు కట్టుకొని నిరసన తెలుపుతున్న కార్మికులు

నర్సీపట్నం, జనవరి 8 : సమస్యల పరిష్కారానికి గత పద్నాలుగు రోజులుగా ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె రోజు రోజుకు ఉధృతమవుతోంది. వీరి ఆందోళనపై ప్రభుత్వం సరైన రీతిలో స్పందించకపోవడంతో సోమవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఇందులో భాగంగా సీబీఎం కాంపౌండ్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు వేప కొమ్మలు నడుముకు కట్టుకొని ర్యాలీ చేశారు. ప్రభుత్వం తక్షణమే డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచకపోతే పెరిగిన నిత్యావసర ధరలతో గడ్డి తిని బతకాలా అంటూ ప్రశ్నించారు. కరోనా సమయంలో తాత్కాలికంగా పారిశుధ్య పనిచేసిన కార్మికులకు పని కల్పించాల్సిందిగా కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో శ్రీను, బుర్ర ప్రసాద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'భూమి ఆన్‌లైన్ కోసం ప్రదక్షిణలు'

▸ తహసీల్దార్‌కు విన్నవించిన టీడీపీ నాయకుడు



వినతిని అందిస్తున్న స్వామి

మాకవరపాలెం, జనవరి 8 : భూమి ఆన్‌లైన్ కాలేదని గత ఆరు నెలలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోతోందని రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి గనిశెట్టి స్వామి వాపోయారు. ఈ మేరకు తహసీల్దార్ ప్రసాదరావును సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. తాడపాలలోని సర్వే నంబరు 25లో 65 సెంట్లు, సర్వే నంబరు 63/1లో 1.35 ఎకరాల భూమి ఉందన్నారు. ఇంతవరకు ఎకరా భూమిని మాత్రమే ఆన్‌లైన్ చేశారని, మిగిలిన భూమిని ఆన్‌లైన్ చేయలేదని పేర్కొన్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. తహసీల్దార్ మాట్లాడుతూ అన్ని వివరాలు పరిశీలించి వారం రోజుల్లో మిగిలి ఉన్న భూమిని ఆన్‌లైన్ చేస్తామని హామీ ఇచ్చారు.

ఏపీ భూహక్కుల చట్టం-27ను రద్దు చేయాలి

▸ గాంధీ విగ్రహానికి న్యాయవాదుల వినతి



గాంధీ విగ్రహానికి వినతిని అందిస్తున్న లాయర్లు

నర్సీపట్నం, జనవరి 8 : ప్రజల ఆస్తులు, భూములకు ఏమాత్రం రక్షణ కల్పించలేని భూహక్కుల చట్టం-27ను రద్దు చేయాలని నర్సీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఇదే అంశంపై గత నలభై రోజులుగా వివిధ రూపాల్లో నిరసన చేపడుతున్న న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించి ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి లోకా లోవరాజుతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

భూ సమస్యపై పెదగంగవరం రైతులు ఆందోళన



మెడలో ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలుపుతున్న రైతులు

దేవరాపల్లి, జనవరి 8 : భూ సమస్య పరిష్కరించి తమకు ఊపిరి పోస్తారా... లేక ఉరితీస్తారా.. అంటూ పెదగంగవరం రైతులు ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండలం పరిధిలోని పెదగంగవరం గ్రామానికి చెందిన 300 మంది రైతులు ఏళ్ల తరబడి తమ సాగులో ఉన్న భూములకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. దీనిపై సరైన స్పందన లేదంటూ గ్రామంలోని రామాలయం వద్ద గత రెండు రోజులుగా నిరశన దీక్షలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా సోమవారం వారంతా మెడకు ఉరితాళ్లు తగిలించుకుని సమస్య పరిష్కరించాలని నినాదాలు చేశారు. శ్రీరామ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో కొటాన వెంకటరమణ, ద్వారపురెడ్డి అప్పలనాయుడు, గవిరెడ్డి దేముడు, అక్కునాయుడు, మిడతాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి మార్టులు

▸ ఇప్పటికే నాలుగుచోట్ల ప్రారంభం

▸ స్త్రీనిధి పక్కదారి మండలాల్లో కేసులు

▸ వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి

మాకవరపాలెం, జనవరి 8 : మహిళా సంఘాలను బలోపేతం చేయాలన్న ఉద్దేశ్యంతో జిల్లాలో వైఎస్సార్ చేయూత మహిళా మార్టులను ఏర్పాటు చేస్తున్నట్టు వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి తెలిపారు. సోమవారం ఆమె ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే మాడుగుల, చోడవరం, సబ్బవరం, మాకవరపాలెంలలో ఈ మార్టులను ప్రారంభించినట్టు చెప్పారు. ఇందుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) నుంచి కొంత నిధులు ఏర్పాటు చేస్తున్నారని, మిగిలినది సభ్యుల వాటా ధనంగా పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని సంఘాల రుణాలపై ఆడిట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్త్రీనిధి పక్కదారి పట్టిన మండలాల్లో అక్కడున్న సిబ్బందిపై పోలీసు కేసులు పెట్టామన్నారు.



మాట్లాడుతున్న పీడీ శచీదేవి

మాకవరపాలెం, : మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మహిళా మార్టులను ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే గణేశ్ తెలిపారు. సోమవారం ఇక్కడ మార్టును ప్రారంభించి మాట్లాడారు. వెలుగు పీడీ శచీదేవి, ఏరియా కో-ఆర్డినేటర్ సత్యనారాయణ, ఎంపీపీ సత్యనారాయణ, నాయకులు రుత్తల వాసు, పెట్ల భద్రాచలం పాల్గొన్నారు.

ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

చీడికాడ, జనవరి 8 : విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు తురువోలు సర్పంచ్ మట్టా అప్పారావు, ఉప సర్పంచ్ పి.టి.బాబు అన్నారు. గ్రామంలోని హైస్కూల్‌లో సోమవారం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీచేసి మాట్లాడారు. అనంతరం ఉప సర్పంచ్ బాబు సొంత నిధులతో విద్యార్థులకు ఐడెంటీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదవాలన్నారు. హెచ్ఎం రామకృష్ణారావు, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు జీపీఏ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయిళ్ల అరెస్టు

బుచ్చెయ్యపేట, జనవరి 8 : మండలంలోని వడ్డాది గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం అర్ధరాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఆరుగుర్ని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.7,430ల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు.

చింతలూరులో 'జనంలోకి జనసేన '

మాడుగుల రూరల్, జనవరి 8 : మండలంలోని చింతలూరులో సోమవారం జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మాడుగుల నియోజకవర్గ సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలతో పాటు పార్టీ సిద్ధాంతాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రొబ్బా మహేశ్, శివాజీ, వరహామూర్తి, వరహాలనాయుడు, అచ్యుతరావు, నాగరాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

'అగ్నికుల క్షత్రియులను పార్టీలు గుర్తించాలి'

మాడుగుల రూరల్, జనవరి 8 : అగ్నికుల క్షత్రియులకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పెమ్మె భాస్కర్ వర్మ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన అగ్నికుల క్షత్రియ ఆత్మీయ సమ్మేళన సభలో ఇచ్ఛాపురం, టెక్కలితో పాటు విశాఖ, అనకాపల్లి ప్రాంతాల్లో తమ సామాజికవర్గ సభ్యులు ఎక్కువగా ఉన్నారని సంఘం జాతీయ అధ్యక్షులు నాగిడి సాంబశివరావు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మేడా వెంకట నరసింగరావు తదితర పలువురు పెద్దలు తెలిపారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ తమ సంఘ నాయకులకు టిక్కెట్టు ఇచ్చినా సమైక్యంగా గెలిపించుకుంటామని ఆయన వివరించారు.

'పేదలకు కార్పొరేట్ వైద్యమే లక్ష్యం'



ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట, జనవరి 8 : పేదలందరికీ కార్పొరేట్ వైద్యమే ప్రభుత్వ లక్ష్యమని విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. సోమవారం లోపూడిలో ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించిన నూతన కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. లోపూడిలో రామాలయం నిర్మాణానికి టీటీడీ నుంచి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బంగారుమెట్ట పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ సాయం రమేష్, వైసీపీ వడ్డాది పట్టణ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, వాసు తదితరులు పాల్గొన్నారు.

నాతవరం కాంగ్రెస్ అధ్యక్షుడిగా సన్యాసిరావు



నాతవరం, జనవరి 8 : కాంగ్రెస్ పార్టీ నాతవరం మండల నూతన అధ్యక్షుడిగా చింతల సన్యాసిరావు నియామకమయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీ పటిష్ఠతకు తన వంతు కృషిచేస్తానన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి రండి

- వైసీపీ శ్రేణులకు ఎమ్మెల్యే గణేశ్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, జనవరి 8 : విజయవాడలోని అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి పంచాయతీ నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎమ్మెల్యే గణేశ్ పిలుపునిచ్చారు. సోమవారం ఇక్కడ నియోజకవర్గస్థాయి వైసీపీ నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఈ వేడుకల్లో భాగంగా మంగళవారం నుంచి శుక్రవారం వరకు ప్రతి సచివాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించాలని సూచించారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మాజీ ఛైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, వైస్ ఛైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన నాయుడు, చింతకాయల వరుణ్, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

నర్సీపట్నం, జనవరి 8 : ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఇద్దరికి సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే గణేశ్ సోమవారం ఇక్కడ అందజేశారు. పట్టణంలోని కాపు వీధికి చెందిన నక్కా శ్రీనివాసరావుకు రూ.2లక్షలు, గచ్చపువీధికి చెందిన రుత్తల భాస్కరరావు కుటుంబ సభ్యులకు రూ.3 లక్షల చెక్కులను వైద్యసేవల నిమిత్తం అందజేశారు.


విద్యాలయాల్లో సంక్రాంతి సందడి



నర్సీపట్నం వెంకునాయుడుపేట ఎంపీపీ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు



రావికమతం మండలం కొత్తకోట ప్రభుత్వ పాఠశాలలో...



దేవరాపల్లి మండలం కాశీపురంలో...



చీడికాడ హైస్కూల్‌లో..., గొలుగొండ మండలం ఏఎల్‌పురం పాఠశాలలో...



నర్సీపట్నం/ నాతవరం/ గొలుగొండ/ కృష్ణాదేవిపేట బుచ్చెయ్యపేట/చీడికాడ/ రావికమతం, జనవరి 8 : ఓ వైపు పచ్చని తోరణాలు.. అందమైన రంగవల్లులు.. వాటి మధ్య గొబ్బెమ్మలు.. ఆచుట్టూ చెరకు గెడలతో అలంకరణలు.. మరోవైపు హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు.. భోగి మంటలు.. వెరసి జిల్లాలోని ఏ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలను చూసినా సోమవారం ఇదే సందడి. అంతటా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు ధరించి వేడుకకు వన్నెతెచ్చారు. కొందరు చిన్నారులు వివిధరకాల వేషధారణలతో అలరించారు. పిండివంటలతో పలు చోట్ల సహపంక్తి భోజనాలు చేశారు.